Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 320 పేజీలు 8 వెల : 5 బుధవారం 20 మే 2026

మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ

మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్లు విడుదల

మన తీరంలో మనదే బోటు..మనదే వేట

పొరుగు రాష్ట్రాల్ర మత్స్యకారులకు స్థానం లేదు

సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

నెల్లూరు: మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం తుమ్మలపెంటలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. చరిత్రలో తొలిసారి రూ.262 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రూ.3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 'బోటూ మనదే.. వేటా మనదే' అని సీఎం అన్నారు. తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే.. రాజీలేదు. ఎవరైనా వస్తే రానిచ్చే పరిస్థితి లేదు. భయపడేది లేదు. ఎవరి కోసమో మన జీవనోపాధి కోల్పోవడమేంటి? మన తీరంపై మనకే హక్కులుంటాయన్నారు. పొరుగు రాష్ట్రాలు రావడానికి లేదు. బోటు చొరబడగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే అప్రమత్తమవుతాం.. ఎవరినీ రానివ్వం అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారులకు ఎల్లప్పుడూ ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఆర్థిక భరోసా ఇస్తున్నాం. చరిత్రలో తొలిసారిగా రూ.260 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో వేశాం. గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందించాం. ఇవాళ 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయం అందించాం. 2014-19లో మత్స్యసంపద ఉత్పత్తి 19.18శాతం పెరిగింది. కానీ, వైకాపా హయాంలో నాలుగు రెట్లు పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత.. మత్స్య సంపదపైనే ఎక్కువ మంది ఆధారపడ్డారు. దేశంలో రొయ్యల ఉత్పత్తిలో 80శాతం ఏపీ నుంచే ప్రపంచానికి ఎగుమతి అవుతున్నాయి. సముద్రపు నీటితో సీవీడ్ కల్చర్ చేస్తే డబ్బులే.. డబ్బులు. మగవాళ్లు వేటకు వెళ్తే.. మహిళలు సీవీడ్ పండించాలి. మహిళలకు ఆదాయం పెంచే మార్గాలు సూచిస్తున్నా.. పాటించండి. మత్స్యకారుల జీవితాలు మెరుగుపడాలి. వారి జీవితాల్లో వెలుగు నింపే బాధ్యత ఈ ప్రభుత్వానిదని సీఎం అన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు ఇబ్బందులు ఉండవన్నారు. జువ్వలదిన్నె హార్బర్‌ను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. 'జువ్వలదిన్నె హార్బర్ మీ సొంతం.. నకిలీ ప్రచారాలు నమ్మొద్దన్నారు. చేపలు తింటే డయాబెటిస్ రాదన్నారు. 'మీ చేపల ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తా' అని అన్నారు. 200 మెకనైజ్డ్ బోట్ల మంజూరుతో పాటు రాయితీ ఇస్తామన్నారు.

ఆక్వాను ఎక్కువ చేయాలని సీఎం పేర్కొన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకారుల సాయాన్ని రూపాయి కూడా పెంచలేదని సీఎం విమర్శించారు. 2019-24 మధ్య జగన్ విధ్వంసకర పాలన చేశారని మండిపడ్డారు. 18 నెలల్లో తిరుపతి నుంచి బుల్లెట్ వాహనాలు తయారీ మొదలవనుందని తెలిపారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. టీడీపీ డీఎన్ఏలో బీసీలు ఉన్నారని.. మనది తిరుగులేని అనుబంధమని చెప్పుకొచ్చారు.

కులాలు, మతాల మధ్య చిచ్చుతో రాజకీయం

జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కులాలు మతాల పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్నారని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో దళితులపై జరిగిన దాడులు మర్చిపోలేనివని చెప్పుకొచ్చారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన దళితుడు సుబ్రహ్మణ్యం నాల్గోవర్ధంతి మచిలీపట్నం బలరామునిపేటలోని ఎస్సీ కాలనీలో మంగళ వారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు, కాలనీలోని దళిత ప్రముఖులతో మంత్రి కొల్లు రవీంద్ర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ హయాంలో ఒక్క దళితులనే కాదని.. బీసీలు, మైనార్టీలు కూడా పెద్దఎత్తున దాడులకు గురయ్యారని మంత్రి కొల్లు రవీంద్ర ప్రస్తావించారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన దళితుడు సుబ్రహ్మణ్యంను చంపి శవాన్ని డోర్ డెలివరీ చేశారని ధ్వజమెత్తారు. నాడు ఆ కేసును తారుమారు చేసేందుకుద

జగన్ అనేక ప్రయత్నాలు చేశారని ఆరోపిం చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసును నిష్పక్షపాతంగా విచారిస్తుంటే సాక్షులను ట్యాంపర్ చేసే

ప్రయత్నాలు చేశారని చెప్పుకొచ్చారు. మాస్క్ అడిగిన పాపానికి డా. సుధాకర్‌ని పిచ్చోడిని చేసి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎపిలో వెయ్యి మినీ మార్టులు

తక్కువ ధరలకే సరుకులు అందచేస్తాం

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

న్యూఢిల్లీరాబోయే రోజుల్లో ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రెండో రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ మార్టుల ద్వారా మిల్లెట్స్ కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మనోహర్ తెలిపారు. మినీ మార్టులలో మార్కెట్ ధరల కంటే తక్కువకు నాణ్యమైన సరకులు అందజేస్తామన్నారు. మరోవైపు.. అరకు కాఫీని దేశవ్యాప్తంగా అన్ని మిలిటరీ క్యాంటీన్లలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారని మంత్రి వివరించారు.

ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యలు

అరవింద్ కేజ్రీవాల్, సిసోడియాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు

యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి

భూసేకరణ

వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం

ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ? సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం 23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన అధికారికంగా ప్రకటించడమే తరువాయి

హైదరాబాద్: పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు'

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

కెసిఆర్ హయాంలో జరిగిన తప్పలను సరిదిద్దుతాం

అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ దిశగా చర్యలు

పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం

బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం

స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్ష సమావేశంలో భట్టి

ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రతాపై, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు.

భానుడి ఉగ్రరూపం

ఆదిలాబాద్ జిల్లాలో మండుటెండలు

జనం బయటకు రాలేక నానా తిప్పలు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో భానుడి ప్రతాపం కొనసాగు తున్నది. సోమవారం 44.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా.. మంగళవారం కూడా అదే పరిస్థితి నెలకొంది. మండుటెండల తో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎండ తీవ్రత.. సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతున్నది. ఎండకు వడగాలులు తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు గొడుగులు, టోపీలు, తలకు టవల్స్ చుట్టుకుంటున్నారు. మంచినీరు, మజ్జిగ, లస్సీ ఇతర చల్లని పానీయాలు తీసుకుంటున్నారు. మరో నాలుగు రోజులపాటు ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. ఉదయం, సాయంత్రం పనులు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రతతో, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరఫున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు. కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ,

డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4-వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4-వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఖీఖీ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ మరియు సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ట వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 30 శాతం వ్యర్థాలు ప్రాసెస్ అయ్యాయని వివరించారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాకుండా, భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన?ప్రగతి ప్రణాళిక కింద పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

కార్యక్రమాలు విడివిడిగా చేపట్టిన పారిశుద్ధ్య చర్యలు కాదని, తెలంగాణ విజన్?2047కు అనుగుణంగా పట్టణాల సమ్మిళిత అభివృద్ధికి దోహదపడే సమగ్ర కార్యాచరణలో భాగమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. జపాన్ దేశంలో ని కిటాక్యుష నగర అభివృద్ధి మోడల్ ఆధారంగా బండరావిర్యాల, సిద్దాపూర్ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఎకో టౌన్ తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను 30?35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో, తెలంగాణ రాష్ట్రం తన 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సహా జాతీయ పరిశుభ్రత, పట్టణ పారిశుద్ధ్య ర్యాంకింగ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నిరంతరం మెరుగైన ప్రదర్శన కనబరుస్తోందని, ఇది పౌరులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, ప్రభుత్వం కలిసి చేస్తున్న కృషికి నిదర్శనమని తెలిపారు. పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వ్యర్థాల నిర్వహణను పారిశుద్ధ్య కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఆర్థిక విలువ సృష్టించే ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత ప్రజల జీవనశైలిలో భాగం కావాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జపాన్ తరహాలో మొదటి తరగతి నుంచే పాఠశాలల్లో పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు,
పర్యావరణ బాధ్యత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించే అంశాన్ని అన్ని రాష్ట్రాలు పరిశీలించాలని ఆయన సూచించారు. ప్రజలు, స్థానిక సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, పరిశ్రమ భాగస్వాములు, వివిధ సంస్థల సహకారంతో తెలంగాణ సుస్థిర పట్టణ నిర్వహణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల,స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా లతో సహా సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మానిక్ రాజ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్ఎంసీ సేవలు

హైదరాబాద్: జీహెచ్ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.
ఞాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు. కొత్తగా జీహెచ్ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్, డెత్ హోమ్, ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్
సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. ఞాష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది. సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది. వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని పేర్కొంది. డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

హైదరాబాద్: పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యలు

అరవింద్ కేజ్రీవాల్, సిసోడియాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యల కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్‌కు ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. ముగ్గురికీ కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యల కేసుపై జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ రవీందర్ దుడేజాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్‌లకు ధర్మాసనం కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. వీరంతా నాలుగు వారాల లోపు సమాధానాన్ని దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసును విచారిస్తున్న జస్టిస్ స్వర్ణకాంత శర్మను ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, వారి మద్దతుదారులు టా÷-గ్ం÷ట్ చేశారు. సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు, వీడియోలు పెట్టారు. ఓ విద్యాసంస్థలో జస్టిస్ స్వర్ణకాంత శర్మ మాట్లాడిన పాత వీడియోను ఎడిట్ చేసి, ఆమె ఓ రాజకీయ పార్టీకి అనుకూలంగా మాట్లాడుతున్నట్లుగా తప్పుగా ప్రచారం చేశారు. మె ఈ కేసును నిష్పక్షపాతంగా విచారించలేరని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ ప్రచారంపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఫైర్ అయ్యారు. తనపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం సాగించారనే ఆరోపణలపై గురువారం స్వచ్ఛందంగా కోర్టు ధిక్కరణ చర్యలను ప్రారంభించారు. అదే సమయంలో ఈ కేసు విచారణ నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించారు.

నేటి నుంచి కోస్తాంధ్రలో మండుటెండలు

అమరావతి:కోస్తాంధ్ర జిల్లాల్లో పెరుగుతున్న తీవ్ర ఎండలు, వడగాలుల పరిస్థితులపై ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. మే 19 నుంచి 'ఫీల్స్ లైక్' ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 20 నుంచి 26 వరకు ఉత్తర, మధ్య కోస్తా జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణ, స్థానిక సంస్థలకు ప్రభుత్వం అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడు రోజుల పాటు హీట్ వేవ్ సన్నద్ధత చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. ప్రజలకు హీట్ వేవ్ అలర్ట్‌లు, జాగ్రత్తలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, వాట్సాప్, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్‌ల ద్వారా హెచ్చరికలు అందించాలని ఆదేశించింది. బస్టాండ్లు, మార్కెట్లు, ఆస్పత్రుల్లో తాగునీటి సదుపాయాలు కల్పించాలని.. అవసరమైతే చలివేంద్రాలు, తాత్కాలిక నీటి కియోస్క్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొంది. నీటి కొరత ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే కమ్యూనిటీ హాళ్లు, వార్డు సచివాలయాల్లో కూలింగ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, బస్ స్టాప్‌లు, మార్కెట్లు, జంక్షన్లలో నీడ సదుపాయాలు కల్పించాలని సూచించింది. వృద్ధులు, నిరాశ్రయులు, కార్మికుల కోసం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొంది. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. మధ్యాహ్న వేళల్లో బయటి పనులు తగ్గించాలని, ఫీల్డ్ పనులను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో నిర్వహించుకోవాలని సూచించింది. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపింది. తాగునీటి నాణ్యత పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించింది. హీట్ వేవ్ ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్‌లు యాక్టివ్‌గా ఉంచాలని, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించింది. వార్డు స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలనీ ఆదేశించింది. జంతువులు, పక్షుల కోసం నీటి పాత్రలు ఏర్పాటు చేయాలని, హీట్ వేవ్ పరిస్థితులను ప్రతిరోజూ సమీక్షించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించింది. అత్యవసర పరిస్థితులను వెంటనే జిల్లా యంత్రాంగానికి నివేదించాలని వారికి స్పష్టం చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్ మెమో జారీ చేశారు.

ప్రజలకు చేరువ కోసమే హైవే స్టేషన్లు

విశాఖపట్నం: ప్రజలకు చేరువగా ఉండేందుకు హైవే పక్కన పోలీసుస్టేషన్‌లను ప్రారంభించామని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ నియంత్రణకు అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగిస్తామని పేర్కొన్నారు. మంగళవారం కంచరపాలెం ట్రాఫిక్, ఎయిర్ పోర్ట్ ట్రాఫిక్, ఎయిర్ పోర్ట్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ ట్రాఫిక్ వింగ్ కోసం ప్రత్యేక ఐపీఎస్ అధికారిని నియమిస్తామని డీజీపీ తెలిపారు. రానున్న రోజుల్లో ఈ స్టేషన్‌లోనే సైబర్ క్రైమ్ స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. కోస్టల్ సెక్యూరిటీ హెడ్‌క్వార్టర్ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. కోస్టల్ సెక్యూరిటీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కోస్టల్ ప్రాంతంలో 21 పోలీసుస్టేషన్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రజా భద్రత, మహిళల రక్షణెళి తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. మహిళలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సూచించారు.

తీరప్రాంత భద్రతపై అప్రమత్తం

నెల్లూరు: ఏపీ సముద్ర తీర ప్రాంత భద్రతపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సముద్రంలో నిరంతర గస్తీ కోసం పలు శాఖల అధికారులు, స్థానిక మత్స్యకారులతో సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. నెల్లూరు సముద్ర తీరంలో నిరంతర గస్తీ కోసం ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ పెట్రోలింగ్ కేంద్రాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. డ్రోన్ల ద్వారా గస్తీ నిర్వహిస్తూ, హెచ్చరికలు జారీ చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికారులు ప్రదర్శించారు. తమిళనాడు, పాండిచ్చేరి మరబోట్ల కదలికలపై శాటిలైట్ చిత్రాల సాయం తీసుకోవాలని ఆదేశించారు. జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థలను విస్తృతంగా వినియోగంలోకి తేవాలని సూచించారు. ఏపీ వ్యాప్తంగా ఫిష్ సీడ్ ఉత్పత్తిని పెంచాలని అధికారులకు సీఎం చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. ఇదిలావుంటే నెల్లూరు జిల్లా తుమ్మలపెంటలో నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం చేపల మార్కెట్‌కు వెళ్లి చేపలు కొనుగోలు చేశారు. అనంతరం మత్స్యకారుడు తానంగారి గిరిబాబు ఇంటికి వెళ్లారు. ఆయన ఇంట్లో చేపల కూర వండుతుండగా ముఖ్యమంత్రి కూడా కాసేపు గరిటె తిప్పారు. ఆ తర్వాత గిరిబాబు కుటుంబంతో కలిసి భోజనం చేశారు.

శారీరక సాక్షరత ప్రాముఖ్యం పెరగాలి

హైదరాబాద్: గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్-2026' కార్యక్రమంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత పుల్లెల గోపీచంద్ 'ఫిజికల్ లిటరసీ' అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. తెలంగాణ క్రీడాశాఖ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 18 నుంచి 23 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత సాధికారత, ఫిట్‌నెస్ ప్రోత్సాహం ప్రధాన లక్ష్యాలుగా ఈ వేడుకలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ, శారీరక సాక్షరత ప్రాధాన్యత కేవలం క్రీడాకారులకు మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి వర్గానికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో ఆరోగ్యకర జీవనశైలి, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం, క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో ఫిజికల్ లిటరసీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. క్రీడారంగం దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చే ముఖ్యమైన రంగాల్లో ముందుంటుందని, ఆరోగ్యవంతమైన సమాజం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డా. ఎ. సోనిబాలా దేవి మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ స్థాయిలో క్రీడల ప్రోత్సాహంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్-2026' ద్వారా శారీరక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, క్రీడల్లో సామాజిక భాగస్వామ్యాన్ని విస్తరించడం, రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు సుజాత, రవితేజ, గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, కోచ్‌లు మరియు యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూసార ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ అవసరం

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు పంట దిగుబడుల్లో కీలకపాత్ర పోషించే భూసార ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులను అందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన రైతు నేస్తం 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రాష్ట్రంలోని సుమారు 1,600 వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యంతో రైతులు, వ్యవసాయ అధికారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం ఎరువులు పంపిణీ చేసారు. అనంతరం పచ్చిరొట్ట పంటల సాగు, జిప్సం వాడకం ద్వారా భూసార ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి రైతులకు సాంకేతిక వివరాలు తెలియజేశారు. ఞార్యక్రమంలో భాగంగా వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినప్పటికీ వ్యవసాయంపై ఆసక్తితో ఆయిల్‌పామ్ సాగు చేస్తూ మంచి లాభాలు పొందుతున్న ఖమ్మం జిల్లా రఘునాథపల్లి రైతు మహేష్ తన అనుభవాలను వివరించారు. జిప్సం వాడకం ద్వారా క్షార ప్రభావిత భూముల్లో సాధించిన ఫలితాలను, ఉద్యాన పంటల్లో వచ్చిన లాభాలను సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి వివరించారు. అలాగే పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము సాగు ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించిన అనుభవాలను సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన మహేందర్, నిజామాబాద్ జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన సూర్యరెడ్డి రైతులతో పంచుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భూసార ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పంట దిగుబడుల్లో నేల ఆరోగ్యం కీలకపాత్ర పోషిస్తుందని, రైతులు భూసార పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంలో పచ్చిరొట్ట పంటలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 11,456 మెట్రిక్ టన్నుల జిప్సం పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసినట్లు, ఇప్పటికే 10 జిల్లాల్లో 3,523 మెట్రిక్ టన్నుల జిప్సం అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. బ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం ఎరువులపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమం చివరలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన రైతులు అడిగిన సాగు సంబంధిత సందేహాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సమాధానాలు ఇచ్చారు.

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

హైదరాబాద్:జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్, గన్ పార్కు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారి నియమించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్ కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు.వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

గంగమ్మ తల్లి సేవలో మాజీ ఎమ్మెల్యే సతీమణి శ్రీవాణి రెడ్డి.... ఘన స్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు ....

శ్రీకాళహస్తి ఉత్తేజిత మే 19.

శ్రీకాళహస్తి పట్టణం,ఎన్టీఆర్ నగర్ గంగమ్మ జాతర మహోత్సవ శుభ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి రెడ్డి.

?ముందుగా ఎన్టీఆర్ నగర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు బియ్యపు శ్రీవాణి రెడ్డి కి ఘన స్వాగతం పలికారు.

అనంతరం వినాయకుని దేవాలయం నుండి అమ్మవారి సారెను తీసుకొని ఊరేగింపుగా వెళ్లి గంగమ్మ తల్లికి సమర్పించారు.దర్శనానంతరం వారికి ఆశీర్వచనాలు అందించి,తీర్థప్రసాదాలు అందజేశారు.

?అనంతరం గంగమ్మ తల్లి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

?ఈ కార్యక్రమంలో శివకుమార్ యాదవ్, పఠాన్ ఫరీద్, మున్నా రాయల్,యోగ, బావాజీ, సురేష్,గాంధీ, జీవీకే రెడ్డి, ప్రవీణ్, తరుణ్, అభిషేక్, మోహన్, సూర్య, కల్లి, సమీర్, బాలాజీ రెడ్డి, రెడ్డి భాష, శివ, చెంచయ్య,శీన,భాను తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు గాంధీ" మా పుచ్చలపల్లి సుందరయ్య!

రేణిగుంట లో ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి!!

రేణిగుంట ఉత్తేజిత మే 19.

భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, "కమ్యూనిస్టు గాంధీ"గా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఆయన చిత్రపటానికి నారాయణ, దస్తగిరి కలిసి పూలమాల వేసి సిపిఎం కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. "రెడ్ సెల్యూట్" కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య.. మీ ఆశయాలను సాధిస్తాం. అంటూ నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ.. కామ్రేడ్ సుందరయ్య 1913, మే 1న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో జన్మించారు. మహాత్మా గాంధీ పిలుపు మేరకు 1930లో చదువును మధ్యలోనే వదిలి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) జూ×(వీ) వ్యవస్థాపక సభ్యులలో ఒకరు. 1964 నుండి 1978 వరకు ఆ పార్టీకి మొదటి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారు. జీవితాంతం నిరాడంబరంగా జీవించి, పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా పోరాడారు.స్ఫూర్తిదాయక జీవితంసుందరయ్య ప్రజల మనిషిగా, సమసమాజ స్థాపన కోసం తన ఆస్తిపాస్తులను సైతం త్యజించి ప్రజల కోసం అంకితమైన మహనీయుడు. ఆయన చేసిన త్యాగాలు మరియు పాటించిన విలువలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఐదు మంది కొత్త కార్యకర్తలకు ఆక్సిలరీ నుండి క్యాండిడేట్ సభ్యత్వం ను భారతి, సులోచన, పద్మమ్మ, నారాయణ, దస్తగిరి లకు ఇవ్వడం జరిగిందని పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.ఈ కార్యక్రమంలో రేణిగుంట టౌన్ సిపిఎం పార్టీ కార్యదర్శి కె.ఈశ్వరమ్మ, భారతి, సులోచన, లక్ష్మమ్మ, పద్మమ్మ, మహాలక్ష్మమ్మ, నారాయణ, దస్తగిరి, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, కృషితోనే విజయం సాధ్యం..పట్టా ప్రదానోత్సవంలో ఫస్ట్ క్లాస్ విత్ డిస్టింక్షన్‌తో మెరిసిన శ్రీపురం సన్నిత...

రేణిగుంట ఉత్తేజిత మే 19.

స్థానిక సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు విద్యార్థుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలో బీటెక్ సి.ఎస్.ఈ విభాగంలో ఫస్ట్ క్లాస్ విత్ డిస్టింక్షన్ సాధించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సన్నిత తన పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా సన్నిత మాట్లాడుతూ, పట్టుదల మరియు నిరంతర శ్రమ ఉంటే అసాధ్యమైనది ఏదీ లేదని, తన విజయానికి క్రమశిక్షణే పునాది అని ఉద్వేగంగా పేర్కొన్నారు.అత్యుత్తమ ప్రతిభపై సర్వత్రా ప్రశంసలు:సన్నిత చిన్నతనం నుంచే పుస్తకాలే ప్రపంచంగా చదువులో విశేష ప్రతిభ కనబరిచేవారు. నిరంతర శ్రమ, అంకితభావంతో నేడు ఇంజనీరింగ్‌లో అత్యున్నతమైన 'డిస్టింక్షన్' సాధించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆమె సాధించిన ఈ ఘనత పట్ల కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. సాంకేతిక రంగంపై ఆమెకున్న పట్టు భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ రంగంలో ఆమెను ఉన్నత స్థానంలో నిలబెడుతుందని అధ్యాపకులు ఆకాంక్షించారు.

కళాశాల యాజమాన్యానికి, గురువులకు కృతజ్ఞతలు:తమ కుమార్తె అద్భుత విజయం పట్ల తల్లిదండ్రులు రెవెరెండ్ సతీష్ మరియు శాలిని హర్షం వ్యక్తం చేశారు. సన్నితను ఇంతటి ప్రతిభావంతురాలిగా తీర్చిదిద్దిన కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపాల్‌కు మరియు లెక్చరర్లకు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అధ్యాపక బృందం అందించిన నాణ్యమైన విద్యాబోధన, క్రమశిక్షణతో కూడిన మార్గదర్శకత్వం వల్లే సన్నిత ఈ స్థాయికి చేరుకుందని వారు కొనియాడారు.

కుటుంబంలో పండుగ వాతావరణం: సన్నిత ఫస్ట్ క్లాస్ విత్ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. అక్క సుమన్విత, అత్త సలోమి, నేహా మరియు నానమ్మ శారద ఆమెను అభినందిస్తూ, భవిష్యత్తులో సన్నిత మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ పట్టా ప్రదానోత్సవం సన్నిత జీవితంలో ఒక గొప్ప మైలురాయిగా నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు.

డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'డ్రగ్స్ పై దండయాత్ర 2.0'....

సబ్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రేతలు, వినియోగదారుల కదలికలపై నిఘా...

రేణిగుంట ఉత్తేజిత మే 19.

తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రేతలు, వినియోగదారుల కదలికలపై నిఘా ఉంచామని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. 'డ్రగ్స్ పై దండయాత్ర 2.0' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రేణిగుంటలో గంజాయి అలవాటు ఉన్న అనుమానితులకు ప్రత్యేక కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ... గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారు, గంజాయి విక్రయించే పెడ్లర్స్, అలాగే వినియోగదారుల కన్స్యూమర్స్ వివరాలను సేకరించి, వారిని పిలిపించి ఎన్టీఆర్ కూడలి వద్ద'బయో-చెక్' కిట్ల ద్వారా పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడించారు.అనుమానితుల నుంచి సేకరించిన నమూనాలను ఈ కిట్ ద్వారా పరీక్షించి గంజాయి వాడుతున్నారా లేదా అనేది నిర్ధారిస్తారు.ఈ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారి ద్వారా గంజాయి నెట్‌వర్క్‌కు సంబంధించిన ఫార్వర్డ్, బ్యాక్ వర్డ్ లింకులను ఐడెంటిఫై చేసి అదుపులోకి తీసుకుంటామన్నారు.గంజాయికి బానిసలైన వారిని ఆ అలవాటు నుంచి దూరం చేసేందుకు వారి తల్లిదండ్రుల అంగీకారంతో కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు.పాపానాయుడుపేటలోని 'రాస్' సంస్థ పునరావాస కేంద్రం, అలాగే స్విమ్స్,రుయా ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వారికి విముక్తి కలిగించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని తెలిపారు.సమాజంలో గంజాయి మహమ్మారిని నిర్మూలించేందుకు ఈ తనిఖీలు మరియు పరీక్షలు నిరంతరం కొనసాగుతాయని, గంజాయి రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సీఐ జయచంద్ర, మరియు ఇతర పోలీస్ సిబ్బంది

వైసిపి హయాంలోనే ఎస్సీలపై బహిరంగవేధింపులకు గురి అయ్యారు

మండల కన్వీనర్ మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి

మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి

ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 19:

నందికొట్కూరు పట్టణంలో ఏబీఎం పాలెం లో వైసీపీ హయాంలో ఎస్సీలపై విచ్చలవిడిగా అధిక దౌర్జన్యాలు జరిగాయని మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: గత వైసీపీ ఎమ్మెల్సీ వద్ద మాజీ డ్రైవర్గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం సదరు ఎమ్మెల్సీతో తలెత్తిన వివాదం కారణంగా హత్యకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి వీధి సుబ్రహ్మణ్యం (మరణించిన తేదీ: 19 మే 2022) అన్నారు.ఆయన మృతదేహాన్ని తీసుకొచ్చి వాళ్ల ఇంటి వద్దే పడేసి, మొదట్లో దీనిని ఒక ప్రమాదంగా నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే, తీవ్రంగా కొట్టడం వల్లే ఆయన మరణించాడని దర్యాప్తులో వెల్లడైంది అన్నారు.రాజకీయ అండతో అధికారాన్ని ఎలా దుర్వినియోగం చేస్తున్నారో మరియు వారిలో జవాబు దారీతనం ఎంతలా లోపించిందో చెప్పడానికి ఈ ఘటనే స్పష్టమైన నిదర్శనం అన్నారు.

అనంతరం నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ: ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్ ప్రభుత్వ అనస్థీటిస్ట్, కోవిడ్-19 సమయంలో పీపీఈ (పి పి ఈ) కిట్ల కొరత గురించి ఆందోళనలు లేవనెత్తిన తర్వాత సస్పెండ్ చేయబడి, బహిరంగంగా వేధింపులకు గురయ్యారు డాక్టర్. సుధాకర్ (మరణించిన తేదీ - 21 మే 2021) అన్నారు.ఆ తర్వాత ఆయన అరెస్టు చేయబడి అవమానించబడ్డారు, తద్వారా వైసీపీ పాలనలో ప్రశ్నించే గొంతుకల అణిచివేతకు మరియు ఎస్సీ వృత్తినిపుణులను లక్ష్యంగా చేసుకుని వేధించడానికి ఆయన ఒక సజీవ సాక్ష్యంగా, ఒక ప్రతీకగా మిగిలిపోయారు అన్నారు. ఈ ఘటనలన్నీ కలిపి చూస్తే.. ముఖ్యంగా ఎస్సీ వ్యక్తులు, వృత్తిపరమైన నిపుణులు, మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలపై వైసీపీ హయాంలో నిరంతర బెదిరింపులు, దౌర్జన్యాలు (హింస), మరియు వ్యవస్థాగత అన్యాయాలకు ఇవి అద్దం పట్టాయి అన్నారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి ధర్మారెడ్డి, పల్చని మహేశ్వర్ రెడ్డి, షకీల్ అహ్మద్, కళాఖర్, నిమ్మకాయల రాజు, నిమ్మకాయల మోహన్, బుల్లెద్దుల రాజు, ప్రేమ్, (రగడ ప్రవీణ్) బ్రహ్మయ్య ఆచారి, శ్రీకాంత్ గౌడ్, అబ్దుల్లా, ఎల్లయ్య ఆచారి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు ... జీవితం ముద్దు

యువతకు తుగ్గలి,జొన్నగిరి, మద్దికేర ఎస్సైలు అవగాహన.

మత్తు రహిత కర్నూలు జిల్లాగా కృషి చేయడానికి ప్రజలు సహకరించాలి.

తుగ్గలి/మద్దికేర: ఉత్తేజిత న్యూస్:

డ్రగ్స్ వద్దని ఉన్న ఒక జీవితమే ముద్దు అని తుగ్గలి ఎస్సై నరేష్,జొన్నగిరి ఎస్ఐ ఎన్. సి మల్లికార్జున,మద్దికేర ఎస్సై హరిత లు యువతకు పిలుపునిచ్చారు.కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పత్తికొండ డిఎస్పి వెంకటరామయ్య, పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్ గౌడ్ సూచనలతో మంగళవారం రోజున తుగ్గలి,మద్దికేర మండలాలలో విస్తృత అవగాహన కార్యక్రమాలను వారు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సైలు తమ పోలీస్ స్టేషన్ నందు వేరువేరుగా మాట్లాడుతూ గంజాయి,ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినడంతో పాటు కిడ్నీ, లివర్,గుండె సంబంధిత వ్యాధుల బారిన పడతారని తెలిపారు.మత్తు కోసం దొంగతనాలు,నేరాలకు పాల్పడి కుటుంబానికి,సమాజానికి చెడ్డపేరు తెస్తారని హెచ్చరించారు.ఒకసారి మత్తు పదార్థాలకు అలవాటు పడితే బయటపడడం కష్టమని,కాబట్టి అసలు జోలికే వెళ్లవద్దని యువతకు సూచించారు.తల్లిదండ్రులు కూడా తమ పిల్లల

ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరారు.మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా వెంటనే డయల్ 100 లేదా 1972 యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తి గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.మత్తు రహిత కర్నూలు జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి వారు చేశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహానంది - నవనందీశ్వర క్షేత్రం.

మహా నందీశ్వరుడు, అమ్మవారు కామేశ్వరీ దేవి.
నందీశ్వర నమస్తుభ్యం సాంబానందప్రదాయకం.

శ్రీ శైలము, మహానంది జంట దేవాలయాలు. జంటగా చెప్పుకుంటాము.అంటే ప్రక్కప్రక్కనే వున్నాయనికాదు. రెండూ కర్నూలు జిల్లాలో ఒకదానికొకటి 175 కిలోమీటర్ల దూరంలో వుంటాయి. నల్లమల అడవులలో శ్రీ శైలం కొండమీద వుంటే, మహానంది దిగువన నంద్యాల పట్టణ సమీపంలో వుంటుంది.కానీ....శ్రీ శైలం అనంగానే మహానంది, మహానంది అనంగానే శ్రీశైలం మన మనోఫలకం మీద తళుక్కుమంటాయి.

బహుశా శివయ్య, ఆయన వాహనం నంది కదూ అందుకనేమో.ఒకసారి నందికి తన పేరుతో శివక్షేత్రం ఏర్పడాలని మనసులో కోరిక కలిగిందట.

తత్ఫలితమే....మహానంది క్షేత్ర ఆవిర్భావం. పేరులోనే వున్నది మహా...నంది.సుమారు1500 ల సంవత్సరాల నాటి ఆలయం.నంద్యాలలో దిగి మహానంది వెలుతుంటే దారి పొడుగునా అరటితోటలు, చుట్టు అలముకున్న నల్లమల అడవులు, సెలయేరుల గలగల, ఆహ్లాదకర వాతావరణం... ఇప్పుడు అప్పుడు అనిలేదు అన్ని కాలాల్లోను భక్తులను ఆకర్షిస్తూనే ఉంటుంది.

ఆలయం దరిదాపులకు రాంగానే రండి రండి ఇదే ఆలయం అని చెప్తూ పెద్ద నల్లరాతి నంది నేరుగా ఆలయాన్ని, ఆలయంలోని పరమశివుని చూస్తూ ఆలయం ముందే వుంటుంది. కోనేరులు, రాజ గోపురం, ఆలయం, దాని వెనుక భాగాన కనిపించే ఎత్తైన కొండలు. ప్రకృతి సౌందర్యమంతా ఇక్కడే వుంటుంది.

ఆలయ స్థలపురాణానికి వస్తే .....నందన మహారాజు గోశాలలో "కపిల" అనే గోవు వుండేది.మిగిలిన ఆవులతో కలసి అరణ్యంలోకి మేతకు వస్తున్న కపిల రోజూ ఆ దాపున వున్న పుట్టలోకి క్షీరాన్ని వదులుతూ వుండేది. అది గమనించిన గోపాలకుడు ఒకరోజు చాటుగా వచ్చి అక్కడ ఏమున్నదో చూడాలని కుతూహలంతో ఇంకా ఇంకా దగ్గరకు వస్తాడు. గోపాలకుని చూసిన గోవు తొట్రుపడి కదులుతుంది.కాళ్లు పుట్ట మీద పడి పుట్ట కొద్దిగా చీలుతుంది. గిట్టల ముద్ర పడుతుంది.పుట్టలో కూచుని రోజూ కపిల గోవు ఇస్తున్న క్షీరాన్ని తాగుతున్న శివయ్య అదే పుట్టరూపంగా మారి పోతాడు.ఇదీ టూకీగా ఈ ఆలయ చరిత్ర.నేటికీ మనం చూసే శివలింగం మీద ఆవు గిట్టల ముద్రలు వుంటాయి.చిన్న శివలింగం. స్వయంభువు.ఉదయము, సాయంకాలమూ 6:00 నుంచీ 6:30 వరకూ మహా మంగళ హారతి సమయంలో నిజరూప దర్శనం వుంటుంది. అప్పుడు పుట్ట ఆకారంతో వెలసిన స్వామిని మనం కళ్లారా చూడవచ్చు.అలంకారం అయిన తరువాత రజత నాగాభరణంతో పుష్పాలంకారాలతో పుట్ట కనిపించదు. శివలింగం మీద ఆవు గిట్టల ముద్రలు వున్నట్లు కనబడతాడు.గర్భాలయంలోని శివలింగం కిందనుంచీ ఐదు జలధారలు ఉద్భవించి నిరంతరం నీరు ఊరుతూ వుంటుంది.స్పర్శ దర్శన సమయంలో శివలింగాన్ని స్పృశించినపుడు మన చేతులకు తడి తగులుతుంది.

ఇదీ గర్భాలయంలో వుండే స్వామి వారి దర్శనం.

ఇహ ఆలయం విషయానికి వస్తే.....

ఆలయం లోపలికి వస్తూనే రెండు పుష్కరిణిలు. బ్రహ్మ గుండం, విష్ణు గుండం.అవి దాటి లోపలి ప్రాకారంలోకి వెలితే రుద్ర గుండమని మరో పుష్కరిణి.

ఇదే అసలయిన కోనేరు. ఈ ఆలయ ప్రత్యేకత కూడా ఇదే.గర్భాలయంలో స్వామివారి పీఠభాగంలోనుంచీ వచ్చే ఐదు జలధారలూ అంతర్వాహినిగా వచ్చి నందిముఖంలోనుంచీ ఈ గుండంలోకి వస్తాయి.

ఇందులోని నీరు క్లిష్టర్ క్లియర్ గా వుంటాయి. చిన్న గుండుసూది పడినా కనిపించేటంత స్వచ్ఛంగా వుంటాయి.ఈ కోనేరులో స్నానం చేయటం బాగుంటుంది.కోనేరులోని నీటి ఉష్ణోగ్రత కాలానుగుణంగా మారుతూ వుంటుంది. ఎండాకాలం చల్లగానూ. చలికాలం గోరు వెచ్చగానూ వుంటాయి.

ఏటెల్లకాలమూ కోనేరులో నీరు సరిగ్గా ఐదు అడుగుల లోతు వుంటాయి.ఏ కాలమూ ఏ మార్పు వుండదు.

పుష్కరిణి మధ్యలో వసంతమండపమని ఒక చిన్న మండపం అందులో ఐదు శివలింగాలు వుంటాయి.

నందిముఖంగా నీరు రుద్ర గుండంలోకి వస్తే, రుద్ర గుండంలోని నీరు రెండు వేపులా రెండు కాలువల ద్వారా రాజగోపురం బయట వున్న బ్రహ్మ గుండం, విష్ణు గుండాలలోకి వచ్చేలా ఏర్పాటు చేశారు. అక్కడ నుంచీ బయటకు వెళతాయి.అలా వెళ్లిన నీరు నేటికీ 10,000 ఎకరాల ముక్కాల సాగుకు ఉపయోగపడుతుందట.

మహానందీశ్వరాలయానికి

ఈ కోనేరులే ప్రత్యేక ఆకర్షణ.ఉదయం 5:30 నుంచీ రాత్రి తొమ్మిది గంటల వరకూ నిర్విరామంగా మహానందీశ్వరుని దర్శనం వుంటుంది.

ఘనంగా 'మత్స్యకార సేవ' కార్యక్రమం... వర్చువల్‌గా పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు...

తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్‌పాల్గొన్న తుడా చైర్మన్, ఎస్పీ, జేసీ, పలువురు శాసనసభ్యులు మరియు కార్పొరేషన్ చైర్మన్లు

తిరుపతి ఉత్తేజిత మే 19.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'మత్స్యకార సేవ' విడియో కాన్ఫరెన్స్ మీటింగ్‌లో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు తో కలిసి తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సందేశాన్ని, మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారు ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివరించారు.

ఈ ఉన్నత స్థాయి సమావేశంలో తిరుపతి జిల్లాకు చెందిన పలువురు శాసన సభ్యులు,ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్ లు,మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ గా సూరజ్ ధనుంజయ్ గనోరే

నంద్యాల జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా సూరజ్ ధనుంజయ్ గనోరే మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు.మహారాష్ట్రకు చెందిన ఈయన 2018 ఐఏఎస్ అధికారి.ప్రస్తుతం ఈయన ఫైనాన్స్ డిపార్టుమెంటులో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.కలెక్టరేట్ అధికారులు జేసీకి ఘన స్వాగతం పలికారు

వై .సి.పి హాయంలోనే ఎస్సీలపై దౌర్జన్యాలు ఎక్కువ..

..ప్రసాదరెడ్డి.మార్కెట్ యార్డ్ చైర్మెన్.

ఉదయం కర్నూలు.

నందికొట్కూరు పట్టణంలో ఏబీఎన్ పాలెం నందు వైసీపీ హయాంలో ఎస్సీలపై జరిగిన ప్రధాన దౌర్జన్యాలు వివరిస్తూమార్కెట్ యార్డ్ చైర్మన్ వీరాం ప్రసాద్ రెడ్డి గారు మాట్లాడుతూ: గత వైసీపీ ఎమ్మెల్సీ వద్ద మాజీ డ్రైవర్గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం.. సదరు ఎమ్మెల్సీతో తలెత్తిన వివాదం కారణంగా హత్యకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి వీధి సుబ్రహ్మణ్యం (మరణించిన తేదీ: 19 మే 2022) అన్నారు ఆయన మృతదేహాన్ని తీసుకొచ్చి వాళ్ల ఇంటి వద్దే పడేసి, మొదట్లో దీనిని ఒక ప్రమాదంగా నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే, తీవ్రంగా కొట్టడం వల్లే ఆయన మరణించాడని దర్యాప్తులో వెల్లడైంది అన్నారురాజకీయ అండతో అధికారాన్ని ఎలా దుర్వినియోగం చేస్తున్నారో మరియు వారిలో జవాబు దారీతనం ఎంతలా లోపించిందో చెప్పడానికి ఈ ఘటనే స్పష్టమైన నిదర్శనం అన్నారు నందికొట్కూరు మండల కన్వీనర్ మాంద్ర సురేంద్రనాథ్ రెడ్డి గారు మాట్లాడుతూ: ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్ ప్రభుత్వ అనస్థీటిస్ట్, కోవిడ్-19 సమయంలో పీపీఈ (స్రాజు) కిట్ల కొరత గురించి ఆందోళనలు లేవనెత్తిన తర్వాత సస్పెండ్ చేయబడి, బహిరంగంగా వేధింపులకు గురయ్యారు డాక్టర్. సుధాకర్ (మరణించిన తేదీ - 21 మే 2021) అన్నారుఆ తర్వాత ఆయన అరెస్టు చేయబడి అవమానించబడ్డారు, తద్వారా వైసీపీ పాలనలో ప్రశ్నించే గొంతుకల అణిచివేతకు మరియు ఎస్సీ వృత్తినిపుణులను లక్ష్యంగా చేసుకుని వేధించడానికి ఆయన ఒక సజీవ సాక్ష్యంగా, ఒక ప్రతీకగా మిగిలిపోయారు అన్నారు ఈ ఘటనలన్నీ కలిపి చూస్తే.. ముఖ్యంగా ఎస్సీ వ్యక్తులు, వృత్తిపరమైన నిపుణులు, మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలపై వైసీపీ హయాంలో నిరంతర బెదిరింపులు, దౌర్జన్యాలు (హింస), మరియు వ్యవస్థాగత అన్యాయాలకు ఇవి అద్దం పట్టాయి అన్నారుకార్యక్రమంలో నందికొట్కూరు పట్టణ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి ధర్మారెడ్డి, పల్చని మహేశ్వర్ రెడ్డి, షకీల్ అహ్మద్, కలాకార్, నిమ్మకాయల రాజు, నిమ్మకాయల మోహన్, బుల్లెద్దుల రాజు, సత్యానందం, రమణమ్మ, ప్రేమ్, (రగడ ప్రవీణ్) బ్రహ్మయ్య ఆచారి, శ్రీకాంత్ గౌడ్, అబ్దుల్లా, ఎల్లయ్య ఆచారి, నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

తాతయ్య గుంట గంగమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి అనగాని సత్యప్రసాద్ మరియు తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి..

తిరుపతి ఉత్తేజిత మే 19.

తిరుపతి ప్రజల ఆరాధ్య దైవం, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సోదరి అయిన శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లిని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మరియు తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు.ఆలయానికి విచ్చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిలకు గంగమ్మ దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ మరియు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.ఆలయ సాంప్రదాయం ప్రకారం మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి కు దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ గజమాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం వారు అమ్మవారి మూలవిరాట్టును దర్శించుకుని, ప్రత్యేక పూజలు మరియు అర్చనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సస్యశ్యామలం కావాలని అమ్మవారిని ప్రార్థించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు మంత్రికి, తుడా ఛైర్మన్‌కు వేద ఆశీర్వచనం పలికారు.ఛైర్మన్ మహేష్ యాదవ్ వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం మరియు అమ్మవారి పవిత్ర ప్రతిమను బహుకరించి గౌరవించారు.ఈ కార్యక్రమంలో కూటమి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్ తెదేపా తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు పనబాక లక్ష్మి, శ్రీధర్ వర్మ, పులిగోరు మురళి కృష్ణ,జిల్లా నాయకులు,దేవస్థానం బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

తుడా చైర్మన్ దివాకర్ రెడ్డికి 'డాక్టరేట్' ప్రధానం: ఎస్వీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్



SRI VENKATESWARA UNIVERSITY: TIRUPATI

NOTIFICATION

It is hereby notified that on the recommendations of the Board of Examiners duly appointed to adjudicate the thesis entitled "ECONOMIC CONDITIONS OF TENANT FARMERS: A CASE STUDY IN CHITTOOR DISTRICT" submitted by Mr. Divakara Reddy C and the University has decided to accept the report of the Board of Examiners and declared that Mr. Divakara Reddy C is eligible for the award of the degree of Doctor of Philosophy in ECONOMICS, Department of Economics, SV University, Tirupati.

(BY ORDER)

NEELAM SANJIVA REDDI BHAVAN
TIRUPATI – 517 502.

DATE: 15.05.2026

Dr. B. RAJAMANIKYAM
CONTROLLER OF EXAMINATIONS

ENDORSEMENT No.: B7(1)/Ph.D./Economics/01/2023, Dated: 18-05-2026.

Forwarded to the Commissioner of Printing, Stationery and Stores Purchase (Printing Wing Dept.) Government Regional Press, Sriragar, Satyanarayana Puram, Vijayawada, Andhra Pradesh – 520 011, for favor of Publication in the next issue of the Andhra Pradesh Gazette and send the bill along with TEN spare copies of the Notification.

CONTROLLER OF EXAMINATIONS

Copy to the Candidate:
Mr. Divakara Reddy C,
Research Scholar,
Department of Economics,
S.V.U. College of Arts, Tirupati.

Copy to the Research Supervisor:
Prof. G. Sasaraish (Retd.),
Department of Economics,
S.V. University, Tirupati.

Copy to Co-Research Supervisor:
Prof. R. Sumeetha,
Department of Economics,
S.V.U. College of Arts, Tirupati.

Copy to the Head of the Department of Economics, S.V.U. College of Arts, Tirupati
Copy to the PS to Vice-Chancellor, S.V. University, Tirupati.
Copy to the Editor, University News, Association of Indian Universities, House Avenue, New Delhi (with a request to publish the contents of the Notification as News Item.
Copy to the Editors of All the Dailies through their local correspondents with a request to Publish the contents of the Notification as a News Item.
Copy to the Co-Ordinator, Internal Quality Assurance Cell, S.V. University, Tirupati.
Copy to the Director, SPU Computer Centre, Tirupati, with a request to place the same in the University Web site

తిరుపతి ఉత్తేజిత మే 19.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి,తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి కి పిహెచ్.డి డిగ్రీ ప్రధానం చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా బి. రాజమాణిక్యం ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన ప్రముఖ ఆచార్యులు ప్రొఫెసర్ జి. సవరయ్య పర్యవేక్షణలో అలాగే కో-రీసెర్చ్ సూపర్వైజర్ ప్రొఫెసర్ ఆర్. సునీత మార్గదర్శకత్వంలో డా॥డాలర్స్ దివాకర్ రెడ్డి తన పరిశోధనను పూర్తి చేశారు.

"కౌలు రైతుల ఆర్థిక పరిస్థితులు: చిత్తూరు జిల్లాలో ఒక కేస్ స్టడీ" అనే సామాజిక ప్రాధాన్యత కలిగిన అంశంపై ఆయన సుదీర్ఘ పరిశోధన చేసి, రూపొందించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు కంట్రోలర్ వివరించారు.పరిశోధనలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో సుమారు 312 మంది కౌలు రైతుల కుటుంబాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను డా॥దివాకర్ రెడ్డి నిశితంగా విశ్లేషించారు. వ్యవసాయ రంగంలో కౌలు రైతుల పెట్టుబడులు, అప్పుల భారం, ప్రభుత్వ పథకాల లబ్ధి తదితర అంశాలను శాస్త్రీయంగా

తన గ్రంథంలో పొందుపరిచారు.తన పరిశోధనా కాలంలో డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి రాసిన పలు అత్యుత్తమ పరిశోధనా పత్రాలు ప్రతిష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి.రాజకీయ, సామాజిక పదవుల్లో తీరిక లేకుండా ఉంటూనే, సమాజానికి ఉపయోగపడే కౌలు రైతుల అంశంపై డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి డాక్టరేట్ సాధించడం పట్ల వర్సిటీలో హర్షం వ్యక్తమవుతోంది

దేశంలో రొయ్యల మార్కెటింగ్ పెంచాలి !

మనదేశంలో సరైన విధానాలు లేక పంటలు పండించిన రైతులు నానా యాతన పడుతున్నారు. సరైన మార్కెటింగ్ ఉండదు. సరైన రవాణా సౌకర్యం ఉండదు. సరైన వేదికలు ఉండవు. మదనపల్లి టమోటాలు పండించినా అవి ప్రజలకు చేరవు. నిజామాబాద్ పసుపు ప్రజలకు భారంగా మారింది. గుంటూరు, వరంగల్, ఖమ్మం మిర్చికి పేరొందినా ధర మా÷-తరం ప్రజలకు ఘాటెక్కిస్తుంది. వడ్లు, మక్కలు, శనగలు పండించినా వాటిని ప్రజలకు చేరువ చేసే యంత్రాంగం ఉండదు. దేశంలో ఏ మూల ఏం పండినా అది మారుమూల ప్రజలకు చేరవేసే సమర్థ వంతమైన మెకానిజం దేశంలో ఇంకా బలపడలేదు. అందుకే రైతులు తము పండించిన పంటలను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే వీలు కలగడం లేదు. వ్యాపారులు కూడా వాటిని కొనుగోలు చేసి, ప్రజలకు చేరవేయడం లేదు. మనదగ్గర మక్కలు పండితే ధరలు రావు. కానీ విదేశీ కంపెనీ కెల్లాగ్ వారు కార్న్ ఫ్లేక్స్ మాత్రం వందల్లో డబ్బులు పోసి పావుకిలో కొంటాం. అదే మన మక్కను వాల్యూ యాడెడ్ చేసి అమ్ముకో లేక పోతున్నాం. తాజాగా ఆక్వా రైతుల పరిస్థితి అదేవిధంగా ఉంది. విజినరీ చంద్రబాబు కేంద్రానికి లేఖ రాసి ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారే తప్ప, అందుకు మార్గాలను మాత్రం అన్వేషించడం లేదు. సైనికులకు సరిహద్దుల్లో సరైన ఆహారం దొరకడం లేదని ఆరోపణలు ఉన్నాయి. సైన్యం మెనూలో ఆక్వాను చేర్చాలని చంద్రబాబు కోరారు. ఇది మంచి ఆలోచనగానే గుర్తించాలి. అలాగే ప్రజలకు కూడా ఆక్వాను నేరుగా సరఫరా చేయగలగాలి. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గణనీయ స్థాయిలో భాగస్వామ్యమవుతున్న చేపల, రొయ్యల రైతులకు ఆపన్నహస్తం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసి సరిపెడితే ఎలా అన్నది ఆలోచించాలి. తన పరిధిలోని సమస్యల పరిష్కారానికి కూడా చిత్తశుద్ధి చూపించట్లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఈ నిర్వాకం ఆక్వా రైతులను అధోగతి పట్టిస్తోంది. ట్రంప్ సుంకాలు, ధరల పతనం, వ్యాధులు, మేత రేట్ల మోత, పెట్రో ఛార్జీల పెంపు.. ఆక్వా రైతును ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పుకోనీయడంలేదు. మరోవైపు రూ.వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం, పన్ను ఆదాయాలను తమ బొక్కసంలో వేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, ఇబ్బందులతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు ఆదుకోడానికి అస్సలు చేతులు రావట్లేదు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే బాదిన సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది రొయ్య రైతులు. మన రొయ్యలపై అమెరికా 60 శాతం వరకు దిగుమతి సుకం బాదింది. ఇక్కడ ధరలు 20-30 శాతం పడిపోయాయి. అమెరికా సుంకాల ప్రభావం మన రాష్ట్రం నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై పడింది. సుంకాలు తగ్గించేలా మోడీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం కానరాలేదు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ఎపిలో కూటమి ప్రభుత్వం కూడా పెద్దగా పట్టుపట్టడం లేదు. ఒకటికి రెండు సార్లు లేఖలు రాయడం తప్ప టిడిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. అంతలోనే ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం ఏకపక్షంగా ధరలు పెంచేందుకు తెగబడగా రైతాంగం నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి తాత్కాలికంగా ఆపించింది. ఫిబ్రవరిలో ఒకసారి ఫీడ్ ధరలను కిలోపై రూ.4 పెంచాయి. కేంద్రం కొన్ని రకాల పన్నులు తగ్గించిన సందర్భంలో కంపెనీలు నామమాత్రంగా ధరలు తగ్గించి, కొన్ని రోజులకే పెంచాయి. తిరిగి కిలోపై రూ.10 వరకు పెంచుతున్నట్లు ప్రకటించి వెనక్కి తగ్గాయి. ఎపి ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు. ప్రభుత్వం సమక్షంలో రైతులు, కంపెనీల మధ్య సంప్రదింపులతో జరగాలి. వరి, ఆహార ధాన్యాల కంటే చేపలు, రొయ్యల సాగుతో అధిక ఆదాయం

వస్తుందని ఊదరగొట్టాయి. దాంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. అనధికారిక సాగు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఆక్వా సాగు రోజు రోజుకూ కాస్ట్లీ అయింది. రైతులు ఆ వైపు మళ్లడంతో గాలివాటుగానూ తయారైంది. వ్యాధులు, ప్రకృతి విపత్తులు తరచు నష్టాలు కలిగిస్తున్నాయి. తరచు ధరల పతనం, అదనంగా ట్రంప్ సుంకాల ప్రభావం, తాజాగా యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్‌కు కొరత. అంతలోనే వాటి ధరల పెంపు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. కూటమి సర్కార్ తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామంటోంది. పెరిగిన ఫీడ్ ధరలతో పోల్చితే ప్రభుత్వం తగ్గించింది చాలా తక్కువ. విద్యుత్ సబ్సిడీకి సైతం పలు ఆంక్షలు అమలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ ఛార్జీలు సహా ఇతర సమస్యలను పరిష్కరించి ఆక్వారైతులను,

ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాల్సి ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇప్పుడు దేశీయంగా వీటిని ప్రజలకు చేరువ చేయాలి. 140 కోట్లకు పైగా ఉన్న మన దేశ ప్రజలకు సమతుల్య ఆహారం అవసరం. ఇందులో చేపలు, రొయ్యలు కూడా చేర్చాలి. అందుకు ప్రభుత్వాలు కార్యాచరణ చేయాలి. ప్రజల ఆహారం లో మన పంటలు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే, ఏ పంటయినా అమ్ముడు పోతుంది. మనదేశంలోని అన్ని పట్టణాలకు రొయ్యలు చేరేలా చేయాలి. అలా చేయకుండా ఎన్ని ప్రకటనలు గుప్పించినా లాభం లేదు.

తిరుపతి పవిత్రతను కాపాడండి...రాజకీయ పార్టీలకు డి.ఎం.సి. భాస్కర్ విజ్ఞప్తి...

తిరుపతి వెస్ట్ ఉత్తేజిత మే 19.

?ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో ఇటీవల కాలంలో ఆరోగ్యకరమైన రాజకీయాలు కనుమరుగు అవుతుండటంపై తిరుపతి స్థానిక హక్కుల పోరాట సమితి నాయకులు డి.ఎం.సి. భాస్కర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ విమర్శలు ప్రజా సమస్యల ప్రాతిపదికన ఉండాలి తప్ప, అవి వ్యక్తిగత విరోధాలకు దారితీయడం ఏమాత్రం మంచి పరిణామం కాదని ఆయన హితవు పలికారు. ముఖ్యంగా గంజాయి సాగు, వినియోగం లేదా భూకబ్జాల వంటి అంశాల్లో ఎవరైనా తప్పు చేస్తే, వారిని శిక్షించడానికి మన దేశంలో పోలీస్ అధికారులు, గౌరవ న్యాయస్థానాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. అటువంటి విషయాల్లో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, రాజకీయ నాయకులు అనవసరంగా వ్యక్తిగత దూషణలకు దిగి వాతావరణాన్ని కలుషితం చేయవద్దని కోరారు.ప్రస్తుతం టీడీపీ, జనసేన మరియు వైసీపీ నాయకులు మీడియా వేదికగా వాడుతున్న భాష వలనే క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు మాట్లాడే భాష అత్యంత హుందాగా ఉండాలని భాస్కర్ సూచించారు. తిరుపతి నగరానికి ఒక విశిష్టమైన చరిత్ర, పవిత్రత ఉన్నాయని, ఇక్కడ రాజకీయాలు ఆ నగర ప్రతిష్టను పెంచే విధంగా ఉండాలి తప్ప, దిగజార్చేలా ఉండకూడదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అన్ని పార్టీల నాయకులు సంయమనం పాటించాలని, రాజకీయాన్ని రాజకీయంగానే చూడాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లకుండా, తిరుపతి నగర విశిష్టతను కాపాడటానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డి.ఎం.సి. భాస్కర్ పిలుపునిచ్చారు.

కర్నూలులో బీజేపీ ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమం

రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కలిసిన తుగ్గలి నవీన్ రెడ్డి.

తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:

కేంద్రమైన కర్నూల్ నందు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ప్రశిక్షణ మహాభియాన్ 2026 శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది.బీజేపీ కార్యకర్తలకు సైద్ధాంతిక పరిజ్ఞానం,సంస్థాగత క్రమశిక్షణ అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.శిక్షణ శిబిరంలో కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తిని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు తుగ్గలి నవీన్ రెడ్డి రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.పార్టీ బలోపేతం,క్షేత్రస్థాయి కార్యక్రమాలపై ఇరువురూ చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.రాష్ట్ర అధ్యక్షుడి సూచనల మేరకు ముందుకు వెళ్తామని నవీన్ రెడ్డి తెలిపారు.ఈ శిక్షణ మహాభియాన్‌కు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఆదోని శాసనసభ్యులు పార్థసారథి,ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ,తుగ్గలి మండల అధ్యక్షులు లక్ష్మన్న,తదితర బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు

దేవనకొండ మే 19 (ఉత్తేజిత)

నూతనంగా బాధ్యతలు చేపట్టినటువంటి పత్తికొండ ఆర్డిఓ ఓబులేష్ ని, దేవనకొండ ఎమ్మార్వో రామేశ్వర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన దేవనకొండ మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున, బండి గింజల రంగన్న, బంటుపల్లె వెంకట స్వామి గౌడ్, ఆకుల వీరేష్, వెలమకూరు భాస్కర్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సిరామప్ప, కాశీమ్, పరమేష్, శ్రీరాములు,మురళి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభాల సృష్టికర్తలు.. మన పాలకులు!



ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు బిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్త చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పాదుపు విషయంలో ప్రజాప్రతినిధులకు లెక్కేలేదు.

గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇం తాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాల కు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమ య్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షో భంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధా రణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళుతుంటారు.

ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పులుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.

నిజామాబాద్ జిల్లాకు పంగనామాలు

- ఇచ్చిన హామీలను పట్టించుకోని రేవంత్
- తలెత్తుకోలేక పోతున్న టీపీసీసీ చీఫ్
- మీడియా సమావేశంలో ఎంపీ అర్వింద్ విమర్శలు

నిజామాబాద్, మే 18 : నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ హామీలు ఏమయ్యయాని అన్నారు. ఈ హామీలు నెరవేర్చక పోవడంతో పిసిసి చీఫ్ తతెత్తుకోలేక పోతున్నారని అన్నారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ విలేకర్లతో మాట్లా డుతూ.. టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించా రు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీప్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబా ద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారే బుద్ధి చెబుతారన్నారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ పేర్కొ న్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావని కుండ బద్దలు కొట్టారు. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరంలో 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు గాను కేవలం రూ. 10 కోట్ల నిధులు మాత్రమే యుడిసికి ప్రభుత్వం కేటాయించిందని వివరిం చారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. అంటే రాహుల్ ఇక ప్రధాని కాలే రని తెలంగాణ సీఎం చెప్పారు. తద్వారా ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి బదులు కోమటిరెడ్డి లాంటి జెన్యూన్ పర్సన్‌ని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలకు ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసిఆర్‌నే ప్రజలు నమ్మలేదని.. ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ చురకలు అంటించారు.

అధిక జ్యేష్ఠం.. ఆరంభం

శుభకార్యాలకు అనువు కాదు

తిరుపతి, మే 18 : ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ఆరంభమ య్యింది. అధిక మాసం అంటే అనే సందేహాలు వస్తుంటాయి. ఒకే సంవత్సరంలో ఒకే పేరున్న మాసం రెండు సార్లు వస్తే మొదటిదాన్ని అధికం అని, రెండవదాన్ని నిజమాసమని, శుద్ధం అని అంటారు. హిందూ పంచాంగం చంద్రుడి గమనాన్ని అనుసరిస్తుంది, అయితే గ్రెగోరియన్ క్యాలెండర్ సూర్యుని ఆధారంగా ఉంటుంది. చాంద్రమాన సంవత్సరం సుమారు 354 రోజులు ఉండగా, సౌర సంవత్సరం 365 రోజులు ఉంటుంది. ఈ రెండు మధ్య వచ్చే వ్యత్యాసం వల్ల ప్రతి సంవత్సరం 10,11 రోజుల తేడా ఏర్పడుతుంది. ఈ తేడా ఒక నెలకు చేరినప్పుడు, సుమారు మూడు సంవత్సరాలకు ఒకసారి అదనపు నెలను జోడిస్తారు. దానినే అధిక మాసం అంటారు. ఇది కాలమానం సమతుల్యతను కాపాడడంలో సహాయపడుతుంది. మతపరంగా ఇది ఆధ్యాత్మిక సాధనకు అత్యుత్తమ సమయంగా భావించబడు తుంది. ఈ ఏడాది మే 17, ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం అయ్యింది. 'అసంక్రాంతి మాసో అధికమాసః' అని సనాతన ధర్మశాస్త్రంలో వివరించి ఉంది. అంటే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రయాణించడాన్ని సంక్రమణం లేదా సంక్రాతి అంటారు. ఏ మాసంలో అయితే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రవేశించడో ఆ మాసాన్ని అధిక మాసమని అంటారు. పురాణ కథల ప్రకారం, ఈ అదనపు మాసా న్ని మొదట మల మాసం అని పిలిచేవారు. దానిని శుభకార్యాలకు అనుకూలంగా భావించలేదు. ఏ దేవుడు కూడా దీనికి అధిపతిగా ఉండటానికి ముందుకు రాలేదు. అప్పుడు శ్రీమహావిష్ణువు.. తన పేరు అయిన 'పురుషోత్తమ'ను దీనికి ఇచ్చాడు. అప్పటి నుండి ఇది 'పురుషోత్తమ మాసం'గా ప్రసిద్ధి చెందింది. ఈ మాసంలో విష్ణువును ఆరాధిస్తే అనేక రెట్లు పుణ్యఫలాలు లభిస్తాయని విశ్వా సం. చైత్రం నుండి ఆశ్వయుజ మాసం (మార్చి-అక్టోబర్) మధ్య కాలంలో ఏ నెలలో సూర్య సంక్రమణం (సూర్యుడు కొత్త రాశిలోకి ప్రవేశించడం) జరగదో, ఆ నెల అధిక మాసంగా పరిగణించ బడుతుంది...మళ్ళీ 2029 సాధారణ నామ సంవత్సరంలో చైత్ర మాసము అధిక మాసం వస్తుంది..

పాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర పరిష్కారం

- జైళ్లను సంస్కరించి ఆధునీకరిస్తున్నాం
- రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత
- కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనం

తిరుపతి, మే 18 : రాష్ట్రంలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. అవసరమైతే మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జైల్ సిబ్బంది, పోలీసులు వేరన్నారు. ఖైదీల్లో పరివర్తన కోసం జైల్ సిబ్బంది వారికి దగ్గరగా ఉంటూ.. మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. జైల్ నుంచి పెరోల్‌పై వచ్చే వారిపై కూడా నిఘా ఉంచుతున్నామన్నారు. జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపడతామని చెప్పారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్లో హోంమంత్రి అనిత ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం సబ్ జైల్‌కు వెళ్లిన మంత్రి.. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ.. ఖైదీల్లో సత్పవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు అని చెప్పుకొచ్చారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్ విస్తీర్ణం తక్కువగా ఉందని.. ఖైదీల సంఖ్య 120 ఉండాల్సింది.. 140 మంది ఉన్నట్లుగా తెలిసిందన్నారు. సబ్ జైల్ ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉన్నట్లు జైలు అధికారులు చెప్పారన్నారు. దీన్ని పెంచాలా.. లేక మరోచోట నిర్మాణం చేయాలా అనేది పరిశీలిస్తామని తెలిపారు. ఖైదీల భద్రత తమ బాధ్యత అని.. ఖైదీల్లో కూడా పరివర్తన రావాలని హోంమంత్రి అన్నారు. రాజాబ్ క్యాలెండర్ ద్వారా పోలీసు, ఫైర్, జైల్ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. అంతుకుముందు తిరుమల శ్రీవారిని అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు స్వాగతం పలికిన టిటిడి అధికారులు దర్శనం చేయించి, శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు. వేదాశీర్వచనం చేశారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత

సైకిల్‌పై గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

విజయవాడ, మే 18 : పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కోరారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు సీఎం చంద్రబాబు సూచనలతో తమ వాహనాలను పక్కన పెట్టి, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గిస్తూ కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే సైకిల్‌పై పర్యటించారు. కార్యకర్తలు, అనుచరులతో కలిసి నాగేశ్వరరావు పేట నుంచి ఎండపల్లి, అక్కడి నుంచి చిన్నపాండ్రాక, అనంతరం పాండ్రాక నుంచి నారాయణపురం వరకు సుమారు 50 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబా బు ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆదర్శంగా నిలిస్తేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. సామాన్య ప్రజలు కూడా సాధ్యమైనంత వరకు సమీప ప్రయాణాలకు సైకిల్ లేదా నడకను అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల నేపథ్యంలో విదేశీ దిగుమతుల పై ఆధారపడటం తగ్గిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. ఆయన వెంట అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు.

కేబీఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతపై స్టే

సుప్రీం ఆదేశాలతో నిలిచిపోనున్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు

న్యూఢిల్లీ, మే 18 : కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయ స్థానం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచా రణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె. వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల వస్తున్న పర్యావరణ నష్టాన్ని వివరించి, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోర్టును కోరారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సు ప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్‌డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.

ఎదురు కట్నం ఇచ్చి యువతితో పెళ్లి

ఒక్కరోజులోనే ప్రేమించిన యువకుడితో జంప్

జనగామ, మే 18 : జనగామ జిల్లా బచ్చన్నపేటలో నాటి కన్యాశుల్కాన్ని తలపించే ఘటన చోటు చేసుకుంది. 18 ఏళ్ల యువతికి 45 ఏళ్ల వ్యక్తితో సవతి తల్లి-తండ్రి వివా హం జరిపించిన ఘటన గ్రామంలో సంచలనం సృష్టిం చింది. బచ్చన్నపేటకు చెందిన బీఆర్ఎస్ నేత ప్రశాంత్ రెడ్డి ఇటీవల వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యాడు. అదే గ్రామానికి చెందిన దంపతులకు రూ.20 లక్షల అప్పు ఇచ్చాడు ప్రశాంత్ రెడ్డి. అయితే అప్పు తిరిగి ఇవ్వకపోవ డంతో వారి కూతురినిచ్చి పెళ్లి చేయాలని ఒత్తిడి చేశాడు. అవస రమైతే ఎదురుకట్నం ఇస్తానని ఆశ చూపి కొంత డబ్బు ముట్టజెప్పాడు. దీంతో సవతి తల్లి- తండ్రి కలిసి తమ 18 ఏళ్ల కుమార్తెను బలవంతంగా ఒప్పించి ప్రశాంత్ రెడ్డితో వివాహం జరిపించారు. అప్పటికే యువతి మరో యువకు డిని ప్రేమించింది. దీంతో పెళ్లైన మరుసటి రోజే ప్రియుడి తో యువతి పరారైంది. స్నేహితుల సహాయంతో ప్రశాంత్ రెడ్డి నుంచి తప్పించుకున్న యువతి.. హైదరాబా ద్‌లో మహిళా కమిషన్‌ను ఆశ్రయించింది. ఈ ఘటనపై విచార ణ చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి మహిళా కమిషన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

భూ తగదాలతో అక్కను హత్య చేసిన తమ్ముడు

సూర్యాపేట, మే 18 : భూ తగాదాల కారణంగా తమ్ముడు తన అక్కపై కత్తితో దాడిచేసి హత్య చేశాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సురిగి సైదులుకు, అతడి సోదరి అంజమ్మకు మధ్య భూమి కోసం గొడవలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి గతంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇరువర్గాలను బైండోవర్ చేసి పోలీసులు హెచ్చరించారు. ఈ క్రమంలో ఆమెను అడ్డు తప్పిస్తే త్వరగా భూమిని సొంతం చేసుకోవ చ్చని సైదులు భావించాడు. పనికి వెళ్తున్న అంజమ్మపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేరళంలోనూ మహిళలకు ఉచిత బస్సు

- సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక విభాగం
- ఆశావర్కర్ల గౌరవ వేతనం 3వేలకు పెంపు
- కేరళం సిఎం సతీశన్ కీలక నిర్ణయాలు

తిరువనంతపురం, మే 18 : కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కేరళం ముఖ్యమంత్రిగా సోమవారంనాడు ప్రమాణస్వీకారం చేసిన వీడి సతీశన్ తొలి క్యాబినెట్ సమావేశంలోనే కీలక సంక్షేమ, పాలనా సంబంధిత నిర్ణయాలను ప్రకటించారు. జూన్ 15వ తేదీ నుంచి మహిళలకు కేఎస్ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యార్థినులు, రోజువారీ ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనున్నట్టు కూడా ప్రకటించారు. వృద్ధతరం పెరుగుతుండటం, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల హెల్త్‌కేర్, సామాజిక భద్రత, పునరావాసం, సంక్షేమ పథకాలను ఈ ప్రత్యేక శాఖ సమన్వయం చేస్తుందని చెప్పారు. ఆశావర్కర్ల గౌరవ వేతనాన్ని రూ.3,000కు పెంచుతున్నట్టు కూడా ముఖ్యమంత్రి సతీశన్ ప్రకటించారు. కేరళం హెల్త్‌కేర్ సిస్టంలో ఆశా వర్కర్లు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వర్కర్లు, హెల్పర్లకు రూ.1,000 చొప్పున వేతనం పెంచుతున్నామని, పాఠశాలల్లో వంటపనులు చేస్తున్న వారు, సహాయక సిబ్బంది, ప్రీ-ప్రైమరీ టీచర్లకు అదనంగా రూ.1,000 వేతనం పెంచుతున్నామని చెప్పారు. 2023 నవ కేరళం యాత్ర సందర్భంగా యువజన కాంగ్రెస్ నేతలపై జరిగిన దాడులపై ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం సతీశన్ ప్రకటించారు. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధించేందుకు, జవాబుదారీతనాన్ని పాదుకొలిపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామని, రుణాలు, వ్యయం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై పారదర్శకతకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

బండి సంజయ్ రాజీనామా కోరుతూ ఆందోళన

సిరిసిల్లలో బిఆర్ఎస్, బిజెపిల ఘర్షణతో ఉద్రిక్తత

రాజన్న సిరిసిల్ల, మే 18 : సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్టయిన నేపథ్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలపై బీజేపీ శ్రేణులు దాడికి దిగాయి. ఈ ఘటనలో పలువురు బీఆర్ఎస్ నేతలు గాయపడ్డారు. బీజేపీ శ్రేణులు దాడికి పాల్పడినప్పటికీ బీఆర్ఎస్ నేతలు నిరసనలు ఆపలేదు. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ క్రమంలో ఉద్రిక్తతలు తలెత్తడంతో జిల్లా ఎస్పీ మహేశ్ బి గితే, డీఎస్పీ నాగేంద్రచారి బీజేపీ నేతలను అడ్డుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక బీఆర్ఎస్ నేతలను సముదాయించి పంపించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

చావుబతుకుల్లో కొడుకు

జనగామ, మే 18 : జనగామ జిల్లా రఘునాథపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ఢీకొట్టడంతో తండ్రి అక్కడికక్కడే మరణించగా.. తీవ్రంగా గాయపడిన కొడుకు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. కొమాళ్ల గ్రామానికి చెందిన అలావత్ బాలాజీ (49) తన కుమారుడు నరేశ్‌తో కలిసి సోమవారం ఉదయం టీవీఎస్ ఎక్సెల్‌పై రాఘవపురం బయల్దేరాడు. ఈ క్రమంలో హనుమకొండ- హైదరా బాద్ జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలాజీ అక్కడికక్కడే మరణించాడు. నరేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించి స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు వచ్చిన సిబ్బంది నరేశ్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

- మత ఆధారిత సంక్షేమ పథకాలు రద్దు
- ఇమామ్‌లు, పూజారులకు గౌరవ వేతనం రద్దు
- అన్నపూర్ణ పథకం కింద అర్హులైన మహిళలకు 3వేల సాయం

కోల్‌కతా, మే 18 : సువేందు అధికారి నేతృత్వంలోని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం సీఎం సువేందు అధికారి అధ్యక్షతన బెంగాల్ కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను నిలిపివేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. 2026, జూన్ నుంచి ఈ పథకాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సంక్షేమ కార్యక్రమాలకు మతం రంగు పులమకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని గత టీఎంసీ సర్కార్ ఇమామ్‌లు, ముఅజ్జిన్‌లు, ఆలయ పూజారులకు నెలవారీ గౌరవ వేతనాన్ని అందించిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఉన్న ఇమామ్‌లకు ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనాన్ని అందించింది. ఈ పథకం కింద ఆర్థికంగా బలహీన వర్గాల నుంచి వచ్చిన ఇమామ్‌లు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందజేసేవారు. అలాగే, మసీదులలో భక్తులను ప్రార్థనకు పిలిచే ముఅజ్జిన్‌లకు కూడా ఇదే విధమైన ఆర్థిక సహాయ అందించారు. ఈ రెండు పథకాలకు నిధులనూ మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ఇచ్చేవారు. పంపిణీ చేశారు. ఇమామ్‌ల మాదిరిగానే హిందూ పూజారులు లేదా పురోహితుల కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఈ పథకం కింద ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పురోహితులు నెలకు రూ.2 వేల గౌరవ వేతనాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఘోర పరాజయం పాలైంది. దీంతో బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సువేందు అధికారి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే గత టీఎంసీ సర్కార్ అమలు చేసిన మత ఆధారిత సంక్షేమ పథకాలను సువేందు అధికారి రద్దు చేశారు. ఇకపోతే బీజేపీ ప్రభుత్వం పలు ఇతర సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిర్ణయం తీసుకుంది.క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 'అన్నపూర్ణ' పథకం అమలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1వ తేదీ నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తారు. ఇక, ప్రభుత్వ ఉద్యోగుల కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక ఆరోగ్య రంగంలో కూడా పెద్ద మార్పులు తీసుకురానున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. పీఎం విశ్వకర్మ, పీఎమ్ ఫసల్ బీమా యోజన, పీఎం శ్రీస్కూల్స్ వంటి కేంద్ర పథకాలను కూడా పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ఒక్కసారిగా రద్దు చేయబోమని సీఎం సువేందు అధికారి ఈ సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం.

శంషాబాద్‌లో తప్పిన విమాన ప్రమాదం

500 మీటర్ల ఎత్తులో విమానాన్ని ఢీకొన్న పక్షి

హైదరాబాద్, మే 18 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం బెంగళూరు నుంచి శంషాబాద్‌కు ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతున్న సమయంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. ఆ సమయంలో విమానంలో 76 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. దాదాపు 500 మీటర్ల ఎత్తులో విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు పైలట్ గుర్తించారు. వెంటనే ఈ ఘటనపై అధికారులకు సమాచారం అందించారు. పైలట్ అప్రమత్తతతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం సురక్షితంగా ల్యాండింగ్ అయ్యింది. దీంతో విమానంలోని ప్రయాణికులతో పాటు ఎయిర్‌పోర్ట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్ట్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు విమానాలను పక్షులు ఢీకొన్న ఘటనలు మూడు నమోదు అయినట్లు తెలుస్తోంది. బర్డ్ స్ట్రైక్ ఘటనలు తరచుగా జరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సమీప ప్రాంతాల్లో పక్షుల నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఎయిర్‌పోర్ట్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

ముస్లింలకు సిఎం యోగీ ఆదిత్యానాథ్ హెచ్చరిక

లక్నో, మే 18 : ఇకపై రోడ్లపై నమాజ్ చేయడం ఉదరదని యూపి ప్రభుత్వం హెచ్చరించింది. రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేని అన్నారు. లఖ్‌నవూలో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రించు కోవాలి' అని అన్నారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోడ్లపై నమాజ్‌లు చేయరా అని తరచూ కొందరు నన్ను అడుగుతుంటారు. అలాంటివి ఇక్కడుండవని చెబుతుంటాను. కావాలంటే వెళ్లి చూసుకోమంటాను. రోడ్లున్నవి ప్రజా రవాణా కోసం. ఎవరైనా రోడ్ల కూడళ్ల వద్దకు వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించవచ్చా? ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు?. మరికొందరు అడుగుతుంటారు. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అంటారు. దానికి మా సమాధానం ఒక్కటే. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో జాగా లేకుంటే దానికి తగ్గట్టుగా జనాభా ఉండేలా చూసుకోండి. జనాభాను పెంచుకోకండి. చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఇటీవల పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా యోగి ఆదిత్యనాథ్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై నమాజ్‌లను మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వం అనుమతించ డాన్ని తప్పుపట్టారు. ఆయన వ్యాఖ్యలను టీఎంసీ తోసిపుచ్చింది. మైనారిటీలను యోగి ఆదిత్యనాథ్ బెదిరిస్తున్నారంటూ వ్యాఖ్యానించింది. ఇకపోతే కోర్టు కూడా గతంలో ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. రోడ్లపై నమాజుతో ప్రజలకు ఇబ్బంది క లిగించవద్దని హెచ్చరించింది.

ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

మండిపడ్డ ఎమ్మెల్యే సబితా రెడ్డి

వికారాబాద్, మే 18 : ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రా రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా బోంరాస్ పేట మండలంలోని తుంకి మెట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు పరిస్థితి దీనంగామారిందన్నారు. వర్షాలకు తడిసి ధాన్యం మొలకలు వచ్చాయన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో రైతుల పరిస్థితి ఈ విధంగా ఉంటే రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నా రు. ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటో పెద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మద్యం మత్తులో స్నేహితుడి దారుణ హత్య

మోండా మార్కెట్ పరిధిలో దారుణం

హైదరాబాద్, మే 18 : సికింద్రాబాద్ మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. మద్యం మత్తులో తలెత్తిన చిన్నపాటి వివాదం ఒకరి ప్రాణం తీసే వరకు వెళ్లింది. తనతో పాటే కూర్చొని మద్యం సేవించిన స్నేహితుడినే ఓ వ్యక్తి దారుణంగా హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఎన్.టి.పి.సి భవనంలోని ఐదవ అంతస్తులో ఈ ఘటన చోటుచేసుకుంది. నిన్న రాత్రి నర్సింహులు అనే వ్యక్తి, అతని స్నేహితుడు కలిసి అక్కడే మద్యం సేవించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఒక విషయంలో తీవ్రమైన గొడవ మొదలైంది. మద్యం మత్తులో ఉన్న స్నేహితుడు అక్కడే ఉన్న మద్యం సీసాతో నర్సింహులుపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తలకు బలంగా గాయం కావడంతో నర్సింహులు ఘటనా స్థలంలోనే రక్తపు మడుగులో కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మోండా మార్కెట్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

తొర్రూర్‌లో చదరపు గజం ₹45,500

- బహదూర్ పల్లిలో చదరపు గజం రూ. 40,500
- రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన
- సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం రాక

హైదరాబాద్, మే 18 : రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. ఎటువంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెంది మంచి డిమాండ్‌తో ఫ్యూచర్ సిటీకి, అవుటర్ రింగ్ రోడ్ కు సమీపంలో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలలోని తొర్రూర్ (66 ప్లాట్లు), కుర్మల్ గుడ (11), బహదూర్ పల్లి (8) ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు చెందిన 85 ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సోమవారం నాడు బహిరంగ వేలం నిర్వహించారు. పెద్ద అంబర్ పేట లోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బహిరంగ వేలంలో పాల్గొన్నబిడ్డర్లు చదరపు గజానికి నిర్దేశించిన దానికంటే అధిక మొత్తంతో ఈ ప్లాట్లను కొనుగోలు చేయడం విశేషం. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం వచ్చిందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి గౌతం తెలిపారు. తొర్రూల్ లే అవుట్ లో ప్లాట్ ను కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీలు పడుతూ గరిష్ఠంగా చదరపు గజం స్థలాన్ని రూ.45,500 (నలభైఐదు వేల అయిదు వందలు)కు వేలం పాటలో కొనుగోలు చేశారని ఎండి శ్రీ వి.పి.గౌతం తెలిపారు. ఓఆర్ఆర్, ఆదిభట్ల ఐటి క్యారిడార్ కు సమీపంలో ఉన్న తొర్రూర్ లో 200 -700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 66 ప్లాట్లకు (÷ఔ÷నీబిబ) చదరపు గజానికి కనీస ధర 25 వేల రూపాయలుగా నిర్ధారించగా, సగటున రూ. 32,500 (ముప్పయి రెండు వేల అయిదు వందలు) ధర పలికిందన్నారు. తమకు నచ్చిన భూముల కోసం పోటీ పడుతూ బిడ్డర్లు ఒక దశలో ఎ÷-లాట్ ను దక్కించుకోదానికి దాదాపు ఇరవైసార్లు రేట్లు పెంచారంటే ఇక్కడి భూములకున్న డిమాండ్ అర్థంచేసుకోవచ్చు. అదే విధంగా ఎయిర్ పోర్టు, ఆర్సీఐకి దగ్గర్లో ఉన్న కుర్మల్ గుడ లో 200 నుంచి 400 చదరపు గజాల విస్తీర్ణంలోని ఎ÷-లాట్లకు చదరపు గజం కనీస ధర 20 వేల రూపాయలుగా నిర్ణయించగా, గరిష్ఠంగా రూ.27,500 ధర పలికింది.అవుటర్ రింగ్ రోడ్ ను ఆనుకుని ఉన్న బహదూర్ పల్లి ప్రాంతంలో 200 నుంచి 1000 చదరపు గజాల విస్తీర్ణంలోని ఎ÷-లాట్లకు కూడా మంచి ధర పలికింది. ఇక్కడ చదరపు గజం కనీస ధర 27 వేల రూపాయలుగా నిర్ణయించగా, వేలం పాటలో గరిష్ఠంగా రూ.40,500 (నలభైవేలు ఐదు వందల) రూపాయల ధర పలికింది. వేలం పాటలో సగటున ఈ భూములకు గజం రూ.33,800కు కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించిన ఈ బహిరంగ వేలం విక్రయాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 150 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

ఈపీసెట్ 2026లో ఎంజేపి విద్యార్థుల హవా

- 516 ర్యాంక్ సాధించిన హర్షిణి
- అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఐదువేల లోపు ర్యాంకులు
- ఇంజనీరింగ్‌లో 10వేల లోపు ర్యాంకులు
- విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం అభినందన

హైదరాబాద్, మే 18 : మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సోసైటీ విద్యార్థులు ఈఏపీసెట్-2026 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్ , ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో 3781 మంది విద్యార్థులు క్వాలి÷ అయ్యారు. వీరిలో ఐదువేల లోపు ర్యాంక్ 46మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి (516వ ర్యాంక్), కల్పిత (1315 ర్యాంక్), కె. శ్రవణ్ కుమార్ (1377 ర్యాంక్), టి. నవ్య(1692 ర్యాంక్) అత్యుత్తమ ర్యాంక్ సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ (3513 ర్యాంక్), జి. వినోద్ కుమార్ (3568 ర్యాంక్), ఎన్. రుషిక్ వర్మ (4433 ర్యాంక్) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది ఎంజెపి విద్యార్థులు క్వాలి÷ కాగా వీరిలో ఐదు వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000 లోపు ర్యాంక్ 247 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు క్వాలి÷ కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు విద్యార్థులు, 10000 లోపు ర్యాంక్ 56 మంది విద్యార్థులు, 20000 లోపు ర్యాంక్ 167 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అరజత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ముఖ్య కార్యదర్శి బాల మాయా దేవి గారు, ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు గారు అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులకు శిక్షణ తీసుకుని అత్యుత్తమమైన ఫలితాలు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు.

గద్వాలలో పట్టుచీరల దొంగల అరెస్ట్

జోగులాంబ గద్వాల, మే 18 : గద్వాల పట్టణం కిష్టారెడ్డి బంగ్లా వద్ద పట్టు చీరల దొంగల కలకలం రేపింది. ఎప్పుడూ ప్రజలతో రద్దీగా ఉండే కిష్టారెడ్డి బంగ్లా ప్రాంతంలోని ఓ పట్టు చీరల దుకాణంలోకి సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు వెళ్లి కస్టమర్ల మాదిరిగా నటించారు. సిబ్బంది కళ్లుగప్పి విలువైన పట్టు చీరలను అపహరించిన అనంతరం, వారు ముందుగానే సిద్ధం చేసుకున్న ఒక ఆటోలో అక్కడి నుంచి వేగంగా పరారయ్యారు. గమనించిన స్థానిక వ్యాపారులు, ప్రజలు వెంటనే అప్రమత్తమై సదరు ఆటోను వెంబడించారు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఆటోను అడ్డగించిన స్థానికులు అందులో ఉన్న ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు మహిళలను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు మహిళలను పట్టణ ఎస్సై-2 జహంగీర్ వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు. దొంగలు ఎక్కడి వారనేది విచారిస్తున్నారు.

కారు ఢీకొని భార్యాభర్తలు మృతి

సిద్దిపేట, మే 18 : కారు ఢీకొని బైక్‌పై వెళ్తున్న భార్యభర్తలు మృతి చెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్ మండలం షేర్‌పల్లికి చెందిన ప్రవీణ్ (50), జ్యోతి (45) భార్యభర్తలు. సోమవారం పని నిమిత్తం ఇద్దరు కలిసి బైక్‌పై బయటకు వెళ్లారు. ఈ క్రమంలో గజ్వేల్ సమీపంలోని పత్తి మిల్ దగ్గర ప్రమాదానికి గురయ్యారు. కారు ఢీకొని భార్యభర్తలు చనిపోయారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

ముంబయి- అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ఫస్ట్‌లుక్ ఇదే..

ప్రతిష్టాత్మక ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌కు సంబంధించిన తొలి చిత్రం బయటకొచ్చింది. ఈ రెండు నగరాల మధ్య పరుగులు పెట్టనున్న హైస్పీడ్ రైలుకు సంబంధించిన చిత్రాన్ని దిల్లీలోని రైల్వే మంత్రిత్వ శాఖ భవనం గేటు నంబర్ 4 వద్ద సోమవారం ప్రదర్శించారు. ప్రస్తుతం ఈ చిత్రం ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. పక్షి ఆకారం నుంచి ప్రేరణ పొంది ఈ రైలును రూపొందించినట్లు తెలుస్తోంది. గంటకు సుమారు 300 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా ఈ బుల్లెట్ రైలును డిజైన్ చేశారు. ఇది అందుబాటులోకి వస్తే రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి 7 గంటలకు పైగా పడుతుండగా.. బుల్లెట్ రైలులో కేవలం 2 గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చు. ప్రతిపాదిత నమూనా ప్రకారం ఇందులో 8 కోచ్‌లు ఉంటాయి. ముంబయి- అహ్మదాబాద్ కారిడార్‌లో సబర్మతి, అహ్మదాబాద్, ఆనంద్, వడోదర, భరూచ్, సూరత్, బిలిమోరా, వాపి, బోయిసర్, విరార్, థానే, ముంబయి.. ఇలా మొత్తం 12 స్టేషన్లు ఉంటాయి. తొలి దశలో సూరత్, బిలిమోరా మధ్య మొదటి 100 కిలోమీటర్ల విభాగాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 15న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్లేఆఫ్స్‌లోకి సన్‌రైజర్స్

చెన్నైపై 5 వికెట్ల తేడాతో విజయం

బ్యాటింగ్‌లో అదరగొట్టిన ఇషాన్ కిషన్, క్లాసెన్

చెన్నై: ఐపీఎల్ 2026లో భాగంగా చెపాక్ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో చివరి వరకు ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. చెన్నై నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఒక ఓవర్ మిగిలి ఉండగానే ఛేదించింది. దీంతో హైదరాబాద్ ప్లేఆఫ్స్‌నకు అర్హత సాధించింది. అటు.. గుజరాత్ టైటాన్స్ సైతం ప్లేఆఫ్స్‌నకు చేరుకుంది. ఆర్సీబీ ఇప్పటికే ప్లేఆఫ్స్‌లోకి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో టాప్ 4లో మిగిలిన నాలుగో బెర్త్ కోసం హోరాహోరీ పోరు నెలకొంది. హైదరాబాద్ బ్యాటర్లలో ఇషాన్ కిషన్ (70; 47 బంతుల్లో 7 ఫోర్లు 3 సిక్స్‌లు) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. హెన్రిచ్ క్లాసెన్ (47; 26 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అభిషేక్ శర్మ (26) ఫర్వాలేదనిపించాడు. ట్రావిస్ హెడ్ (6), నితీశ్ రెడ్డి (11) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. సలీల్ అరోరా 10లి, సమ్రాన్ రవిచంద్రన్ 5లి నాటౌట్‌గా నిలిచారు. చెన్నై బౌలర్లలో ముకేశ్ చౌదరి 2, అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్, అకేల్ హొసేన్ తలో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు చెన్నై ఇన్నింగ్స్‌లో.. బ్రెవిస్ (44; 27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్. కార్తిక్ శర్మ 32, శివమ్ దూబె 26, సంజు శాంసన్ 27 ఫర్వాలేదనిపించారు. రుతురాజ్ గైక్వాడ్ (15), ఉర్విల్ పటేల్ (13), ప్రశాంత్ వీర్ (11) విఫలమయ్యారు. అకేల్ హొసైన్ 3లి పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. సన్ రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో పాట్ కమిన్స్ 3, సకీబ్ హుస్సేన్ 2, ఎషాన్ మలింగ, ప్రఫుల్ హింగే చెరో వికెట్ తీశారు.

బీసీసీఐ ఆర్టీఐ పరిధిలోకి రాదు

కేంద్ర సమాచార కమిషన్

బీసీసీఐ.. ప్రభుత్వ యాజమాన్యంలో గానీ, నియంత్రణలో గానీ లేదని, ప్రభుత్వం నుంచి దానికి నిధులు అందవని కేంద్ర సమాచార కమిషన్ వెల్లడించింది. ఆ లెక్కన బీసీసీఐ ఆర్టీఐ పరిధిలోకి రాదని స్పష్టం చేసింది. జాతీయ, అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌ల కోసం బీసీసీఐ భారత్‌కు ప్రాతినిధ్యం వహించడానికి, ఆటగాళ్లను ఎంపిక చేయడానికి గల నిబంధనలు, అధికారాలకు సంబంధించిన సమాచారాన్ని కోరుతూ దాఖలైన అప్పీల్‌ను కమిషన్ కొట్టివేసింది. బీసీసీఐ ప్రజా అధికార సంస్థ అని, ప్రజా సమాచార అధికారులను నియమించాలని 2018లో అప్పటి సమాచార కమిషనర్ ఎం. శ్రీధర్ ఆచార్యులు బోర్డును ఆదేశించారు. ఈ ఆదేశాన్ని బీసీసీఐ మద్రాస్ హైకోర్టులో సవాల్ చేసింది. సుప్రీం కోర్టు గతంలో వెలువరించిన తీర్పుల దృష్ట్యా ఈ అంశంపై మళ్లీ విచారణ చేపట్టాలని మద్రాస్ హైకోర్టు కేంద్ర సమాచార కమిషన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సీఐసీ.. బీసీసీఐ ఆర్టీఐ పరిధిలోకి రాదని తేల్చింది. 'బీసీసీఐ అనేది తమిళనాడు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఒక సొసైటీ. ఇది రాజ్యాంగం ద్వారా గానీ, పార్లమెంటు చేసిన ఏ చట్టం ద్వారా గానీ ఏర్పాటు కాలేదు. ప్రభుత్వ యాజమాన్యం కింద గానీ, ప్రభుత్వ నియంత్రణలో గానీ ఇది లేదు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయమూ అందడం లేదు. అందువల్ల దానిని ఒక ప్రజా అధికార సంస్థ కింద పరిగణించలేం" అని కేంద్ర సమాచార కమిషన్ స్పష్టం చేసింది.

రికీని అలా చూస్తుంటే బాధేసింది: అశ్విన్

ఇంటర్నెట్ డెస్క్: గతేడాది ఫైనలిస్ట్.. ఈసారి కూడా అదిరిపోయే ఆరంభం.. వంసగా విజయాలు.. పాయింట్ల టేబుల్‌లో అగ్రస్థానం.. ఇదంతా ఏప్రిల్ 25కు ముందు. ఆ తర్వాత నుంచి ఒక్క గెలుపు లేదు. పాయింట్ల పట్టికలో ఇప్పుడు నాలుగో ప్లేస్. అభిమానులే తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇక ప్లేయర్ల సంగతేంటి? జట్టుకు మార్గదర్శకుడైన కోచ్ పరిస్థితేంటి? తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓటమిని చవిచూసిన తర్వాత పంజాబ్ ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ ఇలా బేలగా కనిపించాడు. ఆ వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దానిపై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా స్పందించాడు. రికీని చూడగానే బాధ వేసిందని.. తానూ 2018లో ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నట్లు గుర్తు చేసుకున్నాడు. శ్రేయస్ - పాంటింగ్‌కు సానుభూతి తెలిపాడు. "ఆర్సీబీ - పంజాబ్ మ్యాచ్ తర్వాత నేను ఒక పవర్‌ఫుల్ ఇమేజ్ చూశా. డగౌట్‌లో రికీ పాంటింగ్ ఒక్కడే బేలగా కూర్చుండిపోయాడు. ఆ సమయంలో అతడి తలలో ఎన్నో ఆలోచనలు సుడులు తిరుగుతూ ఉంటాయి. ఆరంభంలో అద్భుత విజయాలు నమోదు చేసి టాప్ -2లో లీగ్ స్టేజ్‌ను ముగించాలని భావించిన ఆ జట్టుకు ఇలాంటి ఫలితాలు తీవ్ర నిరాశను కలిగించాయి. ఎక్కడ పొరపాట్లు చేశామో పునః సమీక్షించుకోవాలి.

పొదుపు పాటించాల్సిందే..

ఎస్‌బీఐ, ఎల్ఐసీకి ఆర్థిక శాఖ సూచన

ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థలు పొదుపు చర్యలు పాటించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలంటూ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం సర్క్యులర్ జారీ చేసింది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వంటి సంస్థల అధిపతులకు లేఖ రాసింది. ప్రభుత్వరంగ సంస్థల ఛైర్మన్‌లు, ఎండీలు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు నిర్దేశిత పరిమితి కంటే తక్కువ విదేశీ ప్రయాణాలు చేయాలని ఆర్థికసేవల విభాగం సూచించింది. సమావేశాలు, సమీక్షలు, సంప్రదింపులను వీలైనంత వరకు వర్చువల్‌గానే నిర్వహించుకోవాలని తెలిపింది. అవసరమైతే తప్ప విదేశీ ప్రయాణాలు చేయొద్దని పేర్కొంది. ప్రస్తుతం వినియోగిస్తున్న పెట్రోల్, డీజిల్ అద్దె వాహనాలకు బదులు విద్యుత్ వాహనాలు వినియోగించాలని సూచించింది. విదేశీ మారక నిల్వలు అడుగంటకుండా ఇటీవల ప్రధాని మోదీ పొదుపు చర్యలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించాలని, ఆన్‌లైన్ సమావేశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించిన నేపథ్యంలో ఆర్థిక సేవల విభాగం ఈ సర్క్యులర్‌ని జారీ చేసింది.

భారీ నష్టాల నుంచి కోలుకున్న సూచీలు

ముంబయి: అంతర్జాతీయంగా పెరిగిన చమురు ధరలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ మొదలు కావొచ్చన్న భయాలు, రూపాయి విలువ పతనం వంటి కారణాలతో ఈ ఉదయం భారీ నష్టాలు చవిచూసిన సూచీలు.. తర్వాత కోలుకున్నాయి. ఐటీ స్టాక్స్ అండతో నష్టాలను అధిగమించాయి. సెన్సెక్స్ స్వల్ప లాభాల్లో ముగియగా.. నిఫ్టీ ఫ్లాట్‌గా స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 74,807.97 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,237.99) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో దాదాపు వెయ్యికి పైగా పాయింట్ల నష్టంతో 74,180.26 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆపై క్రమంగా కోలుకున్న సూచీ.. చివరికి 77.05 పాయింట్ల లాభంతో 75,315.04 వద్ద ముగిసింది. నిఫ్టీ 6.45 పాయింట్ల లాభంతో 23,649.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి. టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, మారుతీ సుజుకీ కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 111 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4541 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

అమెరికాలో అదానీపై కేసులన్నీ ఉపసంహరణ

న్యూయార్క్: అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీపై ఉన్న క్రిమినల్ కేసులన్నింటినీ అమెరికా న్యాయ విభాగం ఉపసంహరించుకుంది. ఆరోపణలను రుజువు చేసేందుకు తగిన ఆధారాలు లేవని ప్రాసిక్యూటర్లు నిర్ధారించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో న్యూయార్క్‌లో హై- ప్రొఫైల్ సెక్యూరిటీస్, వైర్ ఫ్రాడ్ కేసు పూర్తిగా ముగిసింది. గతవారంలో సివిల్ కేసులను యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఉపసంహరించిన సంగతి విదితమే. ఇరాన్ ఎల్‌పీజీ (వంటగ్యాస్) దిగుమతులపై ఆంక్షల ఉల్లంఘనకు సంబంధించిన కేసును అమెరికా ఆర్థిక శాఖకు చెందిన ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ)తో పరిష్కరించుకున్నట్లు అదానీ గ్రూపు తెలిపింది. కేసు పరిష్కారం కోసం 275 మిలియన్ డాలర్లు (రూ. 2600 కోట్లకు పైగా) చెల్లించేందుకు అదానీ ఎంటర్‌ప్రైజెస్ అంగీకరించినట్లు వివరించింది. దర్యాప్తునకు విస్తృత సహకారం అందిస్తామని, ఎప్పటికప్పుడు పరిశీలన వివరాలను వెల్లడిస్తామని ఓఎఫ్ఏసీకి తెలియజేశామని వివరించింది. అయితే ఈ కేసు పరిష్కారాన్ని నేర నిర్ధారణ లేదా తప్పు చేసినట్లు చూడరాదని కంపెనీ వెల్లడించింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను దాటేసిన ఎయిర్‌టెల్

టెలికాం సర్వీస్ ప్రొవైడర్ భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువపరంగా రెండో అతిపెద్ద కంపెనీగా అవతరించింది. ప్రైవేటురంగానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరుకుంది. సోమవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు రాణించడంతో ఇంట్రాడేలో మార్కెట్ విలువ రూ. 11.90 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 11.80 లక్షల కోట్లుగా ఉంది. రూ. 18.11 లక్షల కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నాలుగు రోజులుగా రాణిస్తున్నాయి. సోమవారం కూడా మరో 3 శాతం రాణించడంతో ఈ ఫీట్ సాధ్యమైంది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూ. 1,904.60 వద్ద ముగిసిన ఎయిర్‌టెల్ షేరు విలువ.. నేడు 1,953.80 వద్ద గరిష్ఠాన్ని తాకింది. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో 11 శాతం మేర లాభపడింది. ఏప్రిల్‌లో 6 శాతం, మే నెలలో 3 శాతం చొప్పున ఎయిర్‌టెల్ షేరు విలువ పెరిగింది. గతేడాది నవంబర్ 21న రూ. 2,174 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకిన షేర్లు.. ఈ ఏడాది రూ. 1,745 వద్ద 52 వారాల కనిష్ఠానికి చేరడం గమనార్హం. ఇటీవల ఎయిర్‌టెల్ మెరుగైన త్రైమాసిక ఫలితాలను ప్రకటించగా.. హెచ్‌డీఎఫ్‌సీ మాత్రం స్థిరమైన లాభాలను పోస్ట్ చేసింది. ఈ క్రమంలోనే ఎయిర్‌టెల్ షేర్లు రాణిస్తున్నాయి.

డేటింగ్‌లో శ్రీలీల, తిలక్‌వర్మ

రూమర్స్‌ను ఖండించిన తల్లి స్వర్ణలత

నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు జోరందుకున్నాయి. దీంతో శ్రీలీల తల్లి స్వర్ణలత వాటిని ఖండిస్తూ శ్రీలీల పెళ్లికి ఇంకా సమయం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఇలాంటి కథలు ఎలా పుట్టుకొస్తాయో తెలియట్లేదు. ఈ వార్తలలో అణువంత కూడా నిజం లేదు. శ్రీలీల ప్రస్తుతం తన చదువు, యాక్టింగ్‌లో బిజీగా ఉంది. ఏ మాత్రం విరామం దొరికినా నీట్-పీజీ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇలాంటి వ్యక్తిగత విషయాల గురించి ఆలోచించడానికి ఆమెకు మరో ఐదారు సంవత్సరాల సమయం ఉందని స్పష్టతనిచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల-తిలక్ ఇద్దరూ తిరుమలను సందర్శించడం, వాంఖడే టీ20 మ్యాచ్‌లో నటి సందడి చేయడం.. ఇవి రెండూ ఉద్దేశపూర్వకంగా జరగలేదని ఆమె అన్నారు. వాటి ఆధారంగా కథలు అల్లుకుపోవద్దని కోరారు. గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు స్వర్ణలత ఖండించారు.ం

బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో కథనాలు రాగా వాటిని ఖండించారు. కార్తిక్ ఆర్యన్ తల్లి, నేనూ ఇద్దరం గైనకాలజిస్టులం. మా వైద్య నేపథ్యం కారణంగా వృత్తిపరంగా కలుసుకుంటాము. దురదృష్టవశాత్తూ.. అందరూ శ్రీలీల, కార్తిక్‌లకు రిలేషన్ ఉందని రాయడం మొదలుపెట్టారని ఖండించారు.

కాఫీకప్పులో తుఫాన్

కురుప్పులో విజయ్ అంటూ..ప్రచారం

సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో ఆర్‌జే బాలాజీ తెరకెక్కించిన చిత్రం 'కరుప్పు' తెలుగులో వీరభద్రుడుగా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వైరల్ అవుతోంది. ఇందులో విజయ్ నటించారంటూ ఓ వీడియో తెగ చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన సూపర్ హిట్ మూవీ 'లియో' చిత్రానికి సంబంధించిన రిఫరెన్స్ ఉన్నట్లు నెటిజన్లు గుర్తిస్తున్నారు. 'కరుప్పు'లో వచ్చే ఒక సన్నివేశంలో ఎవరో కాఫీ పెడుతున్నట్లు చూపిస్తారు. అయితే ఆ కాఫీ పెడుతున్న వ్యక్తి మరెవరో కాదు.. 'లియో' సినిమాలోని పార్థిబన్ (విజయ్) క్యారెక్టరేనని ఊహించుకుంటున్నారు.

పైగా ఈ సన్నివేశానికి ముందు కాఫీ షాప్‌లో సర్వర్.. 'నీకు స్పెషల్ లియో కాఫీ తెస్తాను' అనడం.. అక్కడ కాఫీ పెడుతోన్న వ్యక్తిని వెనక నుంచి మాత్రమే చూపించడంతో అందరూ విజయ్ అతిథి పాత్రలో నటించారా! అని మాట్లాడుకుంటున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. కాఫీ షాప్ సన్నివేశంలో కనిపించిన శాండీ, జననీ ఇద్దరూ విజయ్ 'లియో'లోనూ కాఫీషాప్ సీన్‌లో నటించారు. ఈ సన్నివేశంపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ పెడుతున్నారు. 'ఈ సీన్ వచ్చినప్పుడు థియేటర్ అరుపులతో దద్దరిల్లింది' అని ఒకరు అనగా.. కరుప్పు' సినిమాలో ఆ కాఫీ కప్పు, ఆ మేకింగ్ స్టైల్ చూస్తుంటే కచ్చితంగా అది 'లియో' సినిమాలోని పార్థిబన్ కేఫ్ రిఫరెన్సే. ఆర్జే బాలాజీ నిజంగానే గట్టి ప్లాన్ చేశారు అని మరో నెటిజన్ కామెంట్ పెట్టారు.

పెద్దికి సెన్సార్ క్లీయరెన్స్

3గంటల రన్ టైమ్ అంటూ ప్రచారం

రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది విడుదలకు సిద్ధమవుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదల దిశగా మరో అడుగు ముందుకు వేసింది. చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి అధికారిక క్లియరెన్స్ లభించినట్లు సమాచారం. దీంతో పాటు ఈ సినిమాకు సంబంధించిన రన్‌టైమ్, సెన్సార్ టాక్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ప్రస్తుతం కమర్షియల్ చిత్రాలు రెండున్నర గంటల లోపే ఉండేలా దర్శకులు ప్లాన్ చేస్తున్నారు. అయితే 'పెద్ది' విషయంలో దర్శకుడు బుచ్చిబాబు కథపై పూర్తి నమ్మకంతో భారీ నిడివిని ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం దాదాపు 3 గంటల 9 నిమిషాల (189 నిమిషాలు) రన్‌టైమ్‌తో సెన్సార్ పూర్తి చేసుకుందని సమాచారం. రంగస్థలం తర్వాత రామ్ చరణ్ కెరీర్‌లో ఇంతటి సుదీర్ఘ నిడివితో వస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. సినిమాలోని భావోద్వేగాలు, యాక్షన్ ఎలిమెంట్స్, కథలోని తీవ్రత ప్రేక్షకులను మొత్తం ప్రయాణంలో కట్టిపడేస్తాయని చిత్ర బృందం ధీమాగా ఉంది. ఎక్కడా కథ నెమ్మదించకుండా స్క్రీన్‌ప్లేను బుచ్చిబాబు ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం 1980ల కాలం నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే జీవన విధానం, క్రీడా సంస్కృతి, మనుషుల మధ్య ఉన్న భావోద్వేగాలు, పంతాలు, పట్టింపులను కథలో ప్రధానాంశాలుగా తీసుకున్నట్లు సమాచారం. ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా కొత్త రస్టిక్ లుక్‌లో కనిపించనున్నారు. పాత్ర కోసం ఆయన తన శరీరాకృతిని కూడా ప్రత్యేకంగా మార్చుకున్నట్లు ఇప్పటికే విడుదలైన పోస్టర్లు స్పష్టం చేశాయి. ఈ లుక్‌కు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సెన్సార్ బృందం నుంచి కూడా సినిమాకు మంచి స్పందన వచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, బుచ్చిబాబు మేకింగ్, సినిమాలోని ఎమోషనల్ కంటెంట్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని టాక్ వినిపిస్తోంది. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా కథలోని భావోద్వేగాలు ప్రేక్షకులను కదిలించే స్థాయిలో ఉంటాయని కూడా సమాచారం.

కొరటాల, బాలయ్య కాంబో

ఆసక్తికర అప్‌డేట్లతో చిత్రసీమలో హాట్ టాపిక్ టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న కాంబినేషన్లలో ఒకటిగా మారిన నటసింహం నందమూరి బాలకృష్ణ దర్శకుడు కొరటాల శివ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే సినిమా కోసం బాలయ్య సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని సెకండ్ హాఫ్‌లో వచ్చే కీలక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కోసం బాలకృష్ణ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారట. ముఖ్యంగా ఈ పాత్ర కోసం ఆయన హెయిర్ స్టైల్‌లో ప్రత్యేక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హాకిమ్ ప్రత్యేకంగా బాలయ్య కోసం కొత్త హెయిర్ డిజైన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవలం హెయిర్ స్టైల్ మాత్రమే కాదు, బాలకృష్ణ డ్రెస్సింగ్ స్టైల్‌లో కూడా మార్పులు చేయనున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అభిమానులు చూడని విధంగా అల్ట్రా స్టైలిష్ మాస్ లుక్‌లో నటసింహం కనిపించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రం షూటింగ్ విషయానికి వస్తే, ఆగస్టు నెలలో సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. మొదటి షెడ్యూల్‌ను భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ప్రారంభించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ఈ సినిమాలో సమాన ప్రాధాన్యం ఉండబోతుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో ఫ్యామిలీ ఎమోషన్స్ కీలకంగా ఉండనున్నాయని, కొరటాల శివ తన స్టైల్‌కు తగ్గట్టుగానే బలమైన సందేశంతో కూడిన కథను సిద్ధం చేశారని టాక్ వినిపిస్తోంది. దేవర తర్వాత కొరటాల తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో కథ విషయంలో ఆయన చాలా సమయం తీసుకుని కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. ఇక నిర్మాణ బాధ్యతలను నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. బాలయ్య ఇప్పటికే వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉండగా, కొరటాల శివతో మొదటిసారి జతకట్టడం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. మాస్ ఎలిమెంట్స్, ఎమోషన్స్, స్టైలిష్ ప్రెజెంటేషన్ కలిస్తే ఈ సినిమా మరో భారీ హిట్‌గా నిలుస్తుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.



అట్లీ-ప్రియ దంపతులకు కూతురు

మియూగా నామకరణం చేసినట్లు వెల్లడి తమిళ దర్శకుడు అట్లీ కుటుంబంలో ఇటీవల ఆనందం రెట్టింపైంది. స్టార్ దర్శకుడు అట్లీ, ఆయన భార్య ప్రియ దంపతులకు ఇటీవల పండంటి ఆడబిడ్డ జన్మించింది. ఇప్పుడు తమ చిన్నారి కుమార్తెకు పెట్టిన ప్రత్యేకమైన పేరు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. గత ఏప్రిల్‌లో జన్మించిన తమ కుమార్తెకు అట్లీ దంపతులు 'మియూ' అనే ప్రత్యేకమైన పేరును ఖరారు చేశారు. పాప పుట్టిన దాదాపు నెల రోజుల తర్వాత, ఆదివారం సోషల్ మీడియా ద్వారా ఈ పేరును అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిన్నారి చేతిని ప్రేమగా పట్టుకున్న ఓ మధురమైన ఫోటోను అభిమానులతో పంచుకున్నారు. ఆ పోస్ట్‌లో వారు, మా హృదయాలకు ఒక కొత్త ఇల్లు దొరికింది. ఆమె పేరు మియూ. మా గుండెల్లో అత్యంత పెద్ద స్థానాన్ని సంపాదించుకున్న చిన్నారి దేవత అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు. ఈ పేరును ప్రత్యేకంగా నిలబెట్టింది దాని అర్థమే. సాధారణంగా భారతీయ లేదా సంస్కృత మూలాల పేర్లు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అయితే అట్లీ దంపతులు జపనీస్ సంస్కృతి నుంచి ఈ పేరును ఎంపిక చేసుకున్నారు. జపనీస్ భాషలో 'మియూ' అంటే అందం, ప్రేమ, పవిత్రమైన సౌమ్యత కలిగిన వ్యక్తి అనే అర్థం వస్తుంది. ఈ విభిన్నమైన పేరు నెటిజన్లను ఆకట్టుకుంటోంది. సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్

టాక్సిక్ విడుదలలో మరింత జాప్యం

కారణాలను వెల్లడించిన హీరో యశ్

యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్'. దీని విడుదల కోసం అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల గురించి తాజాగా యశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని రిలీజ్ విషయంలో హాలీవుడ్ తరహా ప్రణాళికలు ఫాలో అవుతున్నట్లు చెప్పారు. అది ఇక్కడి వాళ్లకు నచ్చకపోవచ్చని కానీ, తాను ఏం చేసినా అభిమానుల కోసమేనని అన్నారు. ఓ హాలీవుడ్ మ్యాగజైన్ కవర్ ఫొటోకు పోజిలిచ్చిన యశ్.. దానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'టాక్సిక్' వాయిదాల గురించి మాట్లాడారు. ఆ సినిమా అంతర్జాతీయ స్థాయిలో విడుదల కానుంది. మేం అన్ని ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని విడుదలను ప్లాన్ చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కోసం మేము తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలు, సాధారణంగా మన దేశంలో సినిమా విడుదల పద్ధతులకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ సినిమాను ప్రకటించినప్పటినుంచే ప్రమోషన్స్, మార్కెటింగ్ మొదలుపెడతారు. కానీ, 'టాక్సిక్' విషయంలో మేము హాలీవుడ్ విధానాన్ని అనుసరిస్తున్నాం. మొదట సినిమాను మొత్తం పూర్తి చేసి, ఆ తర్వాతే డిస్ట్రిబ్యూషన్ గురించి మాట్లాడుకుంటాం. ప్రస్తుతం నేను సినిమా విడుదల ప్రణాళికల పనుల్లోనే ఉన్నాను. ఈ పద్ధతి కచ్చితంగా అభిమానులకు నచ్చకపోవచ్చని అన్నారు. మొదట ఈ సినిమాను మార్చి 19న విడుదల చేయాలని భావించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా జూన్ 4కు వాయిదా వేశారు.

తర్వాత ఈ తేదీకి కూడా రావడం లేదంటూ యశ్ పోస్ట్ పెట్టారు. గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తయిందని ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి రిలీజ్ చేయాలనే ఇప్పుడు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.



Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.